



RNI NO: APTEL/25/A4894

# ఉషశ్రీ
USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిష్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 66 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిల్ల మోహన్ | ఆదివారం 17 - 05 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

# నాలుగో బిడ్డకు రూ.40 వేలు



**మూడో బిడ్డకు రూ.30 వేలు.. నాలుగో బిడ్డకు రూ.40 వేలు**

- మూడో బిడ్డకు రూ.30 వేల ప్రోత్సాహకం
- నాలుగో బిడ్డకు రూ.40 వేల సాయం
- నెలలో పూర్తి వివరాలు ప్రకటిస్తామని సీఎం
- జనాభా పెంపుపై ప్రభుత్వం దృష్టి
- టీఎఫ్ఆర్ 1.5కు పడిపోవడం ఆందోళన
- వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది
- యువ శ్రామికశక్తి కొరత భయం
- పిల్లలు భారముకాదు, ఆస్తి అన్న చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

రాష్ట్రంలో జనాభా పెంపు కోసం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడో బిడ్డకు జన్మను ఇచ్చే దంపతులకు రూ. 30 వేలు, నాలుగో బిడ్డను కంటే రూ. 40 వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. దీనిపై నెల రోజుల్లోగా ప్రకటన చేస్తామని









# కేసీఆర్–జగన్–విజయ్ ప్రాంతీయ కూటమి ప్లాన్ ?

**కేసీఆర్, జగన్, విజయ్ మధ్య కొత్త కూటమి ప్రచారం**

- దక్షిణాదిలో రీజనల్ ఫ్రంట్ ఏర్పాటు ఆలోచనలు
- బీఆర్ఎస్, వైసీపీకి జాతీయ కూటములలో స్థానం కష్టం
- విజయ్ విజయంతో కొత్త రాజకీయ సమీకరణాలు
- కాంగ్రెస్‌తో విజయ్ పొత్తు కూటమికి అడ్డంకి
- అవినీతి ఆరోపణలు కూటమిపై ప్రతికూల ప్రభావం
- ఎన్డీయేకు ప్రత్యామ్నాయంగా ఫ్రంట్ ప్రయత్నం

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఒక తాజా ముఖ్యమంత్రితో చేతులు కలిపి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు తమ రాజకీయ పునరుత్తేజం పొందాలని చూస్తున్నారా. ఏకంగా సౌత్‌లో రీజనల్ రెలీజియన్ ఫ్రంట్ కి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారా అంటే జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే అవును అనే మాట వస్తోంది. ఆ పార్టీలు బీఆర్ఎస్, వైసీపీ టీవీకే అయితే అధినాయకులు కేసీఆర్ జగన్ విజయ్ అని అంటున్నారు. ఇందులో కేసీఆర్ రెండు సార్లు తెలంగాణాకు సీఎం గా చేసి

# పొదుపుపై ప్రత్యేక దృష్టి

- ఇంధన పొదుపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- 6 లక్షల పేద కుటుంబాలకు ఉచితంగా 'సూర్య ఘర్' కనెక్షన్లు
- ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీ అందించాలని సీఎం ఆదేశం
- పునరుత్పాదక ఇంధనంతో ఛార్జీల తగ్గింపునకు చర్యలు
- గత ప్రభుత్వం మోపిన భారాన్ని తగ్గించడమే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఇంధన పొదుపు, పునరుత్పాదక ఇంధన వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని



# కీలక ఒప్పందం

- భారత్‌లో 30 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు నిల్వకు యూఏఈ అంగీకారం
- ప్రధాని మోదీ, యూఏఈ అధ్యక్షుడి మధ్య చర్చల అనంతరం కీలక నిర్ణయం
- వ్యూహాత్మక గ్యాస్ నిల్వలు, ఎల్పీజీ సరఫరాపైనా ఒప్పందాలు
- భారత్‌లో 5 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టనున్న యూఏఈ

# గుడివాడను నానీకే వదిలేశారా

- గుడివాడలో వచ్చే ఎన్నికలపై ఆసక్తి పెరుగుతోంది
- కొడాలి నాని పోటీపై అనిశ్చితి కొనసాగుతోంది
- టిడిపి తరపున వెనిగండ్ల రాము బలంగా కనిపిస్తున్నారు
- నాని మౌనం, కేసులపై చర్చలు కొనసాగుతున్నాయి
- రాము పనితీరు ప్రజల్లో సానుకూల స్పందన పొందుతోంది



ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల నాటికి ఎలాంటి మార్పు ఉంటుందన్న విషయం ఆసక్తిగా మారింది. గత ఎన్నికల సమయంలో వైసీపీ ఫైర్ బ్రాండ్ నాయకుడు అప్పటి ఎమ్మెల్యే కొడాలి నాని తాను మరోసారి పోటీ చేయనని, ఇదే చివరి అవకాశమని ఆయన అప్పట్లో

# పవన్ వ్యాఖ్యల వెనక లోతైన వ్యూహం!

- పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణంపై సమీక్ష
- కూటమిలో మద్దతుపై అసంతృప్తి వ్యాఖ్యలు
- కార్యకర్తల ఆత్మగౌరవం కాపాడుతానని హామీ
- స్థానిక ఎన్నికలపై జనసేన ఫోకస్ పెంపు
- 2029 నాటికి కింగ్ మేకర్ లక్ష్యం

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి పార్టీ ఆఫీసులో నిర్వహించిన ఉద్యమి



ఆత్మీయ సమావేశంలో అనేక విషయాల మీద మాట్లాడారు. ఒక విధంగా ఆయన మరోసారి తన రాజకీయ జీవితాన్ని మొత్తం సింహావలోకనం చేసుకున్నారు. 2007 నుంచి మొదలుపెట్టి 2026 దాకా రెండు దశాబ్దాల తన రాజకీయం ఒడుదుడుకులు మద్దతు పొత్తులు ఒంటరి పోరు పదవుల విషయంలో తన ఆలోచనలు రాష్ట్రం మీద తన కమిట్ మెంట్ ఇలా అన్నీ చెప్పుకుంటూ వచ్చారు. అదే సమయంలో కూటమిలో ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. రాష్ట్రం కోసం ఆలోచించే తాను కార్యకర్తల కోసం ఆలోచించలేనా అని ఆయన వ్యాఖ్యానించారు. తనకు అన్నీ తెలుసు అని చెబుతూనే తాను సర్దుబాటు చేస్తాను మీ ఆత్మగౌరవం తగ్గించను అని చెప్పారు.

**అవతల వైపు నుంచి :** మన వైపు నుంచి నూరు శాతం మద్దతు ఇచ్చినపుడు అవతల వైపు నుంచి అంతే స్థాయిలో రావాలని ఆయన అనడం విశేషం. ఇది

# బాబు బాటలోనే లోకేష్

- చంద్రబాబు సంతృప్తి పొందడం కష్టం అనే అభిప్రాయం
- ఎంత కష్టపడ్డా నాయకులకు తక్కువ మార్కులే
- క్షేత్రస్థాయి వివరాలపై చంద్రబాబు కఠిన పరిశీలన
- లోకేష్ కూడా కఠిన వైఖరి పాటిస్తున్నారని చర్చ
- అన్ని అంశాల్లో పనితీరు మెరుగుపర్చుకోవాలి



ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమికి నేతృత్వం వహిస్తున్న టిడిపిలో ఒక చర్చ ఉంది. నాయకుల విషయంలో చంద్రబాబు సంతృప్తి చెందడం అనేది చాలా కష్టమైన విషయం అనే భావన నాయకులు ఆది నుంచి వినిపిస్తున్నారు. తాము ఎంత పని చేసినప్పటికీ చంద్రబాబు అంత త్వరగా సంతృప్తి చెందరని, మరింత కష్టపడితే తప్ప మార్పులు వేయరని నాయకులు తరచుగా

# బాబు బాటలోనే లోకేష్

చెబుతూ ఉంటారు. గతంలో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో అనేకమంది నాయకులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. చంద్రబాబును మెప్పించడం అంత తేలిక కాదని, తాము 100% కష్టపడితే చంద్రబాబు దగ్గర 10% కూడా మార్కులు రావని చాలామంది నాయకులు చెబుతూ ఉంటారు. పార్టీ విధానాలను గమనిస్తే ఇదే విషయం తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను తను స్వయంగా తెలుసుకోవడంతో పాటు నాయకులు చెబుతున్న విషయాలను బేరీజు వేసుకొని చంద్రబాబు పోల్చి చూసుకుంటారు. ఆ తర్వాత నాయకుల విషయంలో నిర్ణయానికి వస్తారు. ఇది నాయకులకు ఒక రకంగా ఇబ్బందికర అంశమే అయినప్పటికీ పార్టీని డెవలప్ చేసే విషయంలో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పు పట్టే అవకాశం లేదు. అయితే ఇప్పుడు పార్టీలో యువతరం వచ్చింది. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ నియమితులయ్యారు. దీంతో ఈ వ్యవహారంపై నాయకులు ఆశలు పెట్టుకున్నారు. అంటే తాము పడుతున్న కష్టానికి మంచి మార్కులు వస్తాయి అని వారు అంచనా వేస్తున్నారు. కానీ, నారా లోకేష్ వ్యవహారాన్ని గమనించినప్పటికీ నాయకుల విషయంలో ఈ తరహా పరిస్థితి ఉండడం లేదని చెబుతున్నారు. చంద్రబాబు మాదిరిగానే నారా లోకేష్ కూడా వ్యవహరిస్తున్నారన్నది పార్టీలో జరుగుతున్న అంతర్గత చర్చ. అంత తేలికగా నాయకులకు మార్కులు వేసే పరిస్థితి నారా లోకేష్ దగ్గర కూడా లేదని ఎంతో కష్టపడితే తప్ప ఆయన దగ్గర మార్పులు సంపాదించడం చాలా కష్టమని అంటున్నారు. రాయలసీమకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇటీవల నారా లోకేష్ ను కలిశారు. తమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, అదేవిధంగా ప్రజల సంతృప్తి అంశాలపై వారు ఒక నివేదికను అందజేశారు. కానీ ఇదే సమయంలో ఆయన వెంటనే వారిని పాఠశాలల పరిస్థితి ఏ విధంగా ఉంది.. మధ్యాహ్నం భోజనం పై వస్తున్న వార్తలు మీ దృష్టికి వచ్చాయా.. వాటి విషయంలో మీరు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు అని ప్రశ్నలు సంధించారు. దీంతో వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. తాము ఒక కోణంలో ఆలోచిస్తే పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మరింత లోతుగా లోకేష్ ఆలోచించడంతో వారంతా మౌనంగా ఉండిపోయారు. కష్టపడే విషయంలో అన్ని కోణాలను పరిశీలనలోకి తీసుకుంటామని, ఏ చిన్న తేడా వచ్చిన నాయకులకు మార్కులు వేసేది లేదని ఈ సందర్భంగా లోకేష్ చెప్పారు. అంటే ఒక రకంగా చంద్రబాబు బాటలోనే నారా లోకేష్ కూడా పయనిస్తున్నారనే విషయం నాయకులకు స్పష్టమైనది. దీనిని బట్టి నాయకులు తమ పని విధానాన్ని తమ ఆలోచన విధానాన్ని ప్రజలకు చేరువ అయ్యే విధానాన్ని కూడా మరింతగా మెరుగుపరుచుకోవాల్సిన అవసరం స్పష్టం అవుతోంది.

# నాలుగో బిడ్డకు రూ.40 వేలు

చంద్రబాబు ప్రకటించడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. గతంలో కుటుంబ నియంత్రణ పాటించాలని పిలుపునిచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు జనాభా పెంపు కోసం ప్రోత్సాహకాలు ప్రకటించటం ప్రాధాన్యం సంతరించుకుంది. మూడో బిడ్డకు రూ.30 వేలు.. నాలుగో బిడ్డకు రూ.40 వేలు.. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం చేసిన ఈ ప్రకటనపై ఇప్పుడు పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. శనివారం రోజున శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. అక్కడ నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడవ బిడ్డ పుడితే రూ. 30,000, నాలుగవ బిడ్డకు రూ. 40,000 చొప్పున ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను నెల రోజుల్లోగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు. బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే తల్లిదండ్రులకు ఈ సాయం అందిస్తామని ప్రకటించారు. గతంలో కుటుంబ నియంత్రణ పాటించాలని కోరిన చంద్రబాబు.. ఇప్పుడు మరింత మంది పిల్లలను కనాలని దంపతులను కోరటంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. మరోవైపు రెండో బిడ్డకు జన్మనిచ్చిన దంపతులకు రూ.25 వేలు అందించే ఆలోచన చేస్తున్నట్లు చంద్రబాబు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. మార్చి ఐదో తేదీన అసెంబ్లీ వేదికగా చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. రెండో బిడ్డకు జన్మనిచ్చిన దంపతులకు రూ.25 వేలు ప్రోత్సాహకం అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అప్పట్లో వెల్లడించారు. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా కుటుంబాల పరిమాణం తగ్గుతోందని చంద్రబాబు భావిస్తున్నారు. కొందరు దంపతులు ఒక్క బిడ్డతోనే సరిపెట్టుకుంటున్నారని, మరికొంతమంది తమ మొదటి బిడ్డ మగ బిడ్డ కాకపోతేనే రెండో బిడ్డను కనడానికి మొగ్గు చూపుతున్నారని ఆయన చెప్తున్నారు. ఇది జనాభా వృద్ధి రేటు క్షీణించడానికి కారణమవుతోందన్న చంద్రబాబు.. టోటల్ ఫర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) 2.1గా కొనసాగించాల్సిన అవసరం ఉందంటున్నారు. సగటు సంతానోత్పత్తి రేటు 2.1గా ఉన్నప్పుడే జనాభా స్థిరంగా ఉంటుందంటున్న చంద్రబాబు.. అనేక దేశాల్లో తగ్గుతున్న జనాభా, పెరుగుతున్న వృద్ధుల సంఖ్య ఆర్థిక వృద్ధిని దెబ్బతీశాయని హెచ్చరించారు. పిల్లలు ఒక భారం అనే భావన సరికాదని.. వారు ఒక ఆస్తి వంటివారని చెప్తున్నారు.

**చంద్రబాబు ప్రకటనకు కారణం..** మరోవైపు ఏపీలో సంతానోత్పత్తి రేటు ప్రమాదకర స్థాయికి పడిపోతూ ఉండటం.. ఇదే సమయంలో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతూ ఉండటంతో రాబోయే రోజులలో యువ శ్రామికశక్తి కొరత ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. టీఎఫ్ఆర్ అనేది 2.1గా ఉండాల్సి ఉండగా.. ఏపీలో ఇది 1.5కు పడిపోయింది. ఇదే సమయంలో వృద్ధుల సంఖ్య జాతీయ సగటుతో పోలిస్తే ఏపీలో ఎక్కువగా ఉంది. ఏపీలో సీనియర్ సిటిజన్ల జనాభా 32 శాతంగా ఉందని లెక్కలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భవిష్యత్తులో యువత, శ్రామికుల కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో జనాభా పెంపు కోసం ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నారు.

# పవన్ వ్యాఖ్యల వెనక లోతైన వ్యూహం!

కూటమిలో జనసేన కార్యకర్తలకు ఊరట కలిగించే మాటగా ఉన్నా అధినాయకత్వం కూడా క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పరిణామాల మీద స్పందిస్తున్న తీరుగనూ భావించాల్సి ఉంటుందని అంటున్నారు. అంటే తాము రాష్ట్రం కోసం ఆలోచించి మద్దతు ఇచ్చామని కానీ అవతల పక్షం నుంచి తమకు ఆశించిన మద్దతు రాలేదన్నది జనసేనలో ఉందా అన్న చర్చ అయితే సాగుతోంది. 2024లో ఒంటరి పోరుకు బలం ఉందని అయినా రాష్ట్రమే ముఖ్యమని భావించామని పవన్ చెప్పడం కూడా ఇక్కడ మరో కీలకమైన పాయింట్ గా చూడాల్సి ఉంది.

**బలాన్ని చాటుకోవాలనే :** ఓవరాల్ గా చూస్తే తమిళనాడులో విజయ్ పార్టీతో పోల్చవద్దు అని పవన్ చెబుతున్నా కూడా తన ప్రసంగం మొత్తంలో ఆ ప్రభావం చాలానే కనిపించింది అని విశ్లేషిస్తున్నారు అందుకే క్షేత్ర స్థాయిలో జనసేన బలపడాలి అన్నది కూడా పవన్ మార్క్ వ్యూహంగా ఉంది అని అంటున్నారు. క్యాడర్ విషయంలో తాను భరోసాగా ఉంటాను అని చెప్పడం పార్టీకే ఇక మీదట పూర్తి ప్రయారిటీ ఇస్తామని హామీ ఇవ్వడం వంటివి చూస్తే స్థానిక ఎన్నికల నుంచే జనసేన తన రాజకీయ వాటా కోసం గట్టిగానే కృషి చేస్తుందా అన్న చర్చ సాగుతోంది.

**కింగ్ మేకర్ కావాలన్నదే :** మరో వైపు చూస్తే జనసేన వచ్చే ఎన్నికల నాటికి ఏపీలో కింగ్ మేకర్ గా కావాలన్నది కూడా ఆలోచిస్తోంది అని అంటున్నారు పవన్ తాజాగా పార్టీ వేదిక మీద చేసిన వ్యాఖ్యలు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకుంటున్న తీరు స్థానిక సంస్థల ఎన్నికల మీద గురి పెడుతున్న విధానం, మీరే నాకు ముఖ్యం, ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీయను అంటూ క్యాడర్ లో నింపుతున్న ఉత్తేజం ఇవన్నీ వెరసి 2029 ఎన్నికల నాటికి జనసేన గట్టిగా బలం పుంజుకుని రాష్ట్ర రాజకీయాల్లో మరింతగా తన సత్తాను చాటేందుకు సమాయత్తం అవుతోంది అని విశ్లేషిస్తున్నారు. మొత్తానికి తమిళనాడు ఎన్నికల్లో విజయ్ సాధించిన సక్సెస్ ఏపీలో జనసేన మీద బాగానే ప్రభావం చూపిస్తోంది అని అంటున్నారు. రానున్న రోజులలో జనసేన దూకుడు కూడా పెరగనుంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



# పొదుపుపై ప్రత్యేక దృష్టి



సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, విద్యుత్ ఛార్జీలు తగ్గించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. శనివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, శిలాజ ఇంధనాల దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా సంకల్పించారని తెలిపారు. ఇందులో భాగంగానే పగటిపూట సౌరశక్తిని వినియోగించుకునేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని పేదలకు 2 కిలోవాట్ల సామర్థ్యంతో 6 లక్షల 'సూర్య ఘర్' సోలార్ కనెక్షన్లను ఉచితంగా అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కేంద్రం దేశవ్యాప్తంగా కోటి కనెక్షన్లను లక్ష్యంగా పెట్టుకుంటే, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 20 లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయడమే ధ్యేయమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తోందని, దీనికి అదనంగా బీసీలకు రూ.20 వేలు, ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీగా రూ.1.25 లక్షలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి, ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గొట్టిపాటి పేర్కొన్నారు. గత రెండేళ్లుగా రూ.5,000 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించి విద్యుత్ బిల్లులు పెరగకుండా చూసిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపిన భారాన్ని తాము అధికారంలోకి రాగానే తగ్గించామని, ఇప్పటికే యూనిట్‌కు 13 పైసలు తగ్గించామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఛార్జీలు మరింత తగ్గించడమే సీఎం లక్ష్యమన్నారు. తన ప్రోటోకాల్ వాహనాలను తగ్గించుకోవడం ద్వారా ఇంధన పొదుపును స్వయంగా ఆచరిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు సలహాలు, సూచనలతో క్లీన్ ఎనర్జీ అందించే దిశగా పనిచేస్తూ, ప్రపంచంలోని ఉత్తమ విద్యుత్ సంస్కరణలను అందిపుచ్చుకునే తొలి రాష్ట్రంగా ఏపీని నిలబెడతామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# భారత్‌లో 30 మిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వ



**జాతీయం :** భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్య ఇంధన రంగ భాగస్వామ్యం మరింత బలపడింది. భారత వ్యూహాత్మక చమురు నిల్వ కేంద్రాల్లో (స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్) 30 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురును నిల్వ చేసేందుకు యూఏఈ అంగీకరించింది. ప్రధాని నరేంద్ర మోదీ అబుదాబి పర్యటన సందర్భంగా యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో జరిపిన చర్చల అనంతరం ఈ కీలక ఒప్పందం కుదిరినట్లు భారత విదేశాంగ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరాలో అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో, ఈ ఒప్పందం భారత్ ఇంధన భద్రతకు మరింత బలాన్ని చేకూర్చనుంది. ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్ లిమిటెడ్ (ఐఎస్‌పీఆర్ఎల్), అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (అడ్నాక్) మధ్య కుదిరిన వ్యూహాత్మక సహకార ఒప్పందాన్ని ఇరు దేశాధినేతలు స్వాగతించారు. ఇంధన రంగంలో యూఏఈ భారత్‌కు ఒక ముఖ్యమైన భాగస్వామి అని విదేశాంగ శాఖ పేర్కొంది. ముడిచమురు, ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీ సరఫరాలను కలుపుకొని సమగ్ర ఇంధన భాగస్వామ్యం కోసం కృషి చేయాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా, భారత్‌లో వ్యూహాత్మక గ్యాస్ నిల్వలను ఏర్పాటు చేయడంపైనా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), అడ్నాక్ మధ్య దీర్ఘకాలిక ఎల్‌పీజీ సరఫరా ఒప్పందం కుదరడంపైనా నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఇంధన రంగంతో పాటు ఇతర రంగాల్లోనూ పలు ఒప్పందాలు కుదిరాయి. బ్యాంకింగ్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ రంగాల్లో భారత్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ముందుకొచ్చింది. రక్షణ, నౌకా సహకారం, నౌకా నిర్మాణం, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లోనూ సహకరించుకోవాలని నిర్ణయించాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలకు భద్రత కల్పించడం వంటి అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. యూఏఈపై జరిగిన దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

# గుడివాడను నానీకే వదిలేశారా

చెప్పారు. కానీ ప్రజలు ఓడించారు. ఇక ఈ నియోజకవర్గ నుంచి టిడిపి తరఫున వెనిగండ్ల రామ్మోహన్ విజయం సాధించారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఈయనకే టిడిపి అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. మరి వైసీపీ తరఫున ఎవరు పోటీ చేస్తారు అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఇచ్చిన మాట ప్రకారం వచ్చే ఎన్నికల్లో కొడాలి నాని పోటీకి దూరంగా ఉంటారా.. లేకపోతే మాట వెనక్కి తీసుకుని మళ్ళీ పోటీ చేస్తారా అనేది చూడాలి. ప్రస్తుతం అయితే ఈ నియోజకవర్గంలో యాక్టివిటీ లేదు. ఒకవేళ ఉన్నా అది పూర్తిగా కొడాలి నాని కనుసన్నల్లోనే జరుగుతుంది. ఒకప్పుడు తనకు తిరుగులేదని భావించిన నాని గత ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత ప్రజల్లోకి రావడం మానేశారు. పార్టీ తరఫున పెద్దగా వాయిస్ కూడా వినిపించడం లేదు. అయితే ఆయనపై ఉన్న కేసుల కారణంగా మౌనంగా ఉంటున్నారు అన్న చర్చ నడుస్తున్నప్పటికీ తను కేసులకు భయపడే తరహా కాదని ప్రస్తుతం తాను మౌనంగా ఉంటే మంచిదన్న ఉద్దేశంతోనే మౌనంగా ఉంటున్నానని చెబుతున్నారు. సమయం సందర్భం చూసుకుని స్పందిస్తానని ఇటీవల నాని వ్యాఖ్యానించారు. కానీ నియోజకవర్గంలో పరిస్థితి మాత్రం దీనికి భిన్నంగా ఉంది. నానీ విషయంలో ఒక వర్గం నాయకులు ఇప్పటికీ అదే అసంతృప్తితో ఉన్నారు. నానిని గెలిపించడం వల్ల నష్టపోయామని వర్గం ఇప్పటికి అదే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్యే రాము అందరికీ అనుకూలంగా ఉన్నారు. సౌమ్యంగా వ్యవహరిస్తున్నారు. నిజానికి రాము వ్యక్తిగతంగా కూడా మంచివారన్న పేరును సంపాదించుకున్నాడు. అంతేకాదు ఏ సమస్య వచ్చినా ఆయన దగ్గరికి వెళ్తే పరిష్కారం అవుతుందన్న ఉద్దేశం ప్రజల్లో కనిపిస్తోంది. ఈ తరహా పరిస్థితి గతంలో లేకపోవడం.. అదే సమయంలో గత ఎన్నికల సమయంలో నేను మళ్ళీ పోటీ చేయనని నాని చెప్పిన క్రమంలో వచ్చే ఎన్నికల నాటికి ఏం జరుగుతుందని ఇప్పుడు ఆసక్తిగా మారింది. ప్రస్తుతం వైసీపీ కూడా గుడివాడ నియోజకవర్గం పై మౌనంగా ఉంది. అంటే ఈ నియోజకవర్గ విషయంలో పూర్తిస్థాయి నిర్ణయం నాని చేతిలోనే పెట్టినట్టుగా తెలుస్తోంది. మరి ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చూడాలి.

# ప్రాంతీయ కూటమి ప్లాన్ ?

ఓటమి పాలు అయ్యారు. ఏపీలో ఒకసారి అధికారం లోకి వచ్చిన జగన్ కూడా రెండేళ్ళుగా మాజీ సీఎం గా ఉన్నారు. ఇక రెండేళ్ళ క్రితం పార్టీ పెట్టి తాజాగా తమిళనాడు ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన విజయ్ ఇపుడు కేసీఆర్ జగన్ భవిష్యత్తు రాజకీయాకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నారు అని అంటున్నారు.

**రీజనల్ ఫ్రంట్ అంటే :** నిజానికి ఈ రోజున దేశ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఎన్డీయేలో జనసేన టీడీపీ ఉంటే మరి కొన్ని పార్టీలు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో ఉన్నాయి. అయితే ఈ రెండు కూటములలో లేని ఉండలేని ప్రాంతీయ పార్టీలుగా తెలుగు నాట బీఆర్ఎస్ వైసీపీలను చెప్పుకోవాలి. ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్ధి. దాంతో ఇండియా కూటమిలోకి కలవలేరు, అలాగే ఎన్డీయే నాయకత్వంలోని కూటమిలో కూడా చేరలేరు. దాంతో తమకు తాముగా దక్షిణాదిన ఒక ప్రాంతీయ కూటమిని ఏర్పాటు చేసుకుంటే రేపటి రోజున అంటే 2029 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు రాకపోతే తమ బలం అవసరం అవుతుందని అలా తమకు డిమాండ్ ఉంటుందని ఒక కొత్త ప్రయత్నానికి సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది.

**అందుకే విజయ్ తో :** ఇక తమిళనాడులో విజయ్ పార్టీ గెలవడం ఏంటి అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ కూడా పెద్ద ఎత్తున రియాక్ట్ అయిపోయాయి. అంతే కాదు విజయ్ కి కంగ్రాట్స్ చేస్తూ చెలిమికి తెర తీశాయి. ఇక్కడ వైసీపీకి టీవీకేకి సిద్ధాంతపరంగా సారూప్యం కంటే రెండు పార్టీలకూ క్రిస్టియన్ మైనారిటీ ఓటు బేస్ మాత్రం ఒక కామన్ పాయింట్ గా చెబుతున్నారు.ఇక సంక్షేమ పథకాలు ఇతర అంశాలలో జగన్ స్ట్రాటజీని విజయ్ ఫాలో అవుతున్నారని కూడా అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లతో కూడిన బీజేపీ కూటమిని ఢీ కొట్టాలంటే ఈ సఖ్యత కొత్త కూటమి అవసరం అని వైసీపీ భావిస్తుంటే తెలంగాణాలో కూడా దూసుకుని వస్తున్న బీజేపీని ఎన్డీయే కూటమి ఏర్పాటుని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కూడా విజయ్ వంటి మిత్రుడి వైపు చూస్తోంది అని అంటున్నారు. ఇది కేసీఆర్ కి జగన్ కి రాజకీయ అనివార్యంగా కనిపిస్తుంది అని అంటున్నారు.

**కేసీఆర్ జగన్ అంటేనే :** ఇక కేసీఆర్ జగన్ ల మధ్య బలమైన స్నేహం ఉంది అన్నది తెలిసిందే. ఇక ఓటమి తరువాత కూడా బెంగళూర్ ఎలహంక ప్యాలెస్ లో కేటీఆర్ జగ్న సమాలోచనలు జరిపారు అని ప్రచారంలో ఉంది. అలాగే ఎలహంక ప్యాలెస్ నుంచి హైదరాబాద్ కి జగన్ రావాలని లోటస్ పాండ్ లో ఆయన మకాం పెట్టాలని బీఆర్ ఎస్ ఒత్తిడి కూడా తెస్తోంది అని అంటున్నారు. వీటి వెనక కూటమి ప్రాంతీయ స్థాయిలో ఏర్పాటు ప్రయత్నం ఉందని అంటున్నారు.

**కాంగ్రెస్ తో విజయ్ :** అయితే ఈ ప్రాంతీయ స్థాయి కూటమికి ఒక అడ్డంకి ఆదిలోనే ఎదురవుతోంది. అదే విజయ్ కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకోవడం. తన ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతుని విజయ్ కోరారు. రాహుల్ గాంధీ ఏకంగా ప్రమాణ స్వీకారానికి వచ్చారు. దాంతో ఏపీ తెలంగాణాలలో కాంగ్రెస్ పొడ గిట్టని కేసీఆర్ జగన్ వీటిని ఎలా స్వీకరిస్తారు అన్నదే పెద్ద చర్చగా ఉంది. మరో వైపు చూస్తే ఈ కూటమి ప్రాంతీయ స్థాయిలో మూడు రాష్ట్రాలలో మూడు బలమైన పార్టీల మధ్య ఏర్పాటు కావడానికి ప్రయత్నాలు జరగడం వరకూ ఓకే కానీ ఎవరికి వారి ఓటర్లే ఆయా రాష్ట్రాలలో ఉన్నారు. ఎవరు ఎవరికి రాజకీయంగా అండగా ఉంటూ ఆయా రాష్ట్రాలలో ప్రోత్సహించుకోలేని పరిస్థితి ఉందని అంటున్నారు. ఎవరి ఓటర్లు వారికే సెపరేట్ గా ఉండడమే అసలైన మైనస్ పాయింట్ అని అంటున్నారు. దానికి తోడు ప్రాంతీయ ఆకాంక్షల వరకూ సరే అనుకున్నా మత రాజకీయాలను మధ్యలోకి తెస్తే మాత్రం అది ప్రమాదమే కాక బూమరాంగ్ అవుతుందని కూడా అంటున్నారు.

**అవినీతి ముద్రతోనే :** అయితే ఇంకా పురుడు పోసుకోని చర్చలకు ప్రచారానికి పరిమితం అయిన ఈ కూటమికి ఒక బలమైన ముద్ర ఉంది. అదే అవినీతి అని అంటున్నారు. ఏపీలో చూస్తే పార్టీగా వైసీపీని పెట్టక ముందు నుంచే జగన్ మీద అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన మీద సీబీఐ కేసులు పదహారు నెలల జైలు జీవితం ఇవన్నీ ఒక ఎత్తు అయితే 2019 నుంచి 2024 దాకా సాగిన అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో అవినీతి మరో ఎత్తు అని అంటున్నారు. దాని వల్లనే వైసీపీ 2024 లో ఓటమి పాలు అయిందని చెబుతారు. ఒక బీఆర్ఎస్ విషయం తీసుకుంటే ఆ పార్టీ తెలంగాణాలో చేసిన పదేళ్ల పాలనలో కాళేశ్వరం నుండి ఫార్ములా వన్ కార్ రేసింగ్ వరకు భారీ త్తున ఆరోపణలు ఈ రోజుకీ సంచలనంగానే ఉన్నాయని చెబుతున్నారు. మరో వైపు తమిళనాడులో అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన టీవీకే పార్టీ మీద కూడా అవినీతి మరకలు ఆరంభంలోనే ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అదెలా అంటే టీవీకేలో ఆ పార్టీ కీలక నేత, మంత్రి అధర్వ అర్జున్ తండ్రి లాటరీ కింగ్ అని చెబుతున్నారు.

**కూటమి సాధ్యమా :** అయితే ఈ ముగ్గురు నాయకులూ తమ ప్రభావాన్ని రాజకీయంగా దక్షిణాదిన చూపించాలని ప్రయత్నం చేస్తున్నారు. దాని కోసం ప్రాంతీయ కూటమిని కట్టాలని కూడా వ్యూహ రచన చేస్తున్నట్లుగా ప్రచారం అయితే ఉంది. కానీ అవినీతి ఆరోపణలు ఒక వైపు మరో వైపు మత రాజకీయాలను ముందుకు తీసుకుని రావడం వంటివే అడ్డంకిగా మారుతాయా అన్న చర్చ సాగుతోంది. అయితే దక్షిణాదిన ఎన్డీయే కూటమిని మరీ ముఖ్యంగా చంద్రబాబుకు ముకు తాడు వేయాలని ఈ కూటమి పెద్దల ప్రధాన లక్ష్యమని అంటున్నారు. మరి వీరి ఆశలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయన్నది తెలియాలన్నా అనేక ప్రశ్నలకు జవాబు దొరకాలన్నా కొంత కాలం పాటు వేచి చూడాల్సి ఉందని అంటున్నారు.

## గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్' నిషేధ ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల.



గిద్దలూరు: గిద్దలూరు నియోజకవర్గం గిద్దలూరు పట్టణంలోని పర్యావరణ పరిరక్షణలో భాగంగా గిద్దలూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' పిలుపులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఏకకాల వినియోగ ప్లాస్టిక్) వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు కలిసి భారీ ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతద్దంలా పర్యావరణాన్ని ప్రజల ఆరోగ్యాన్ని అతలాకుతలం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే తరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని మానిపించి, ప్రత్యామ్నాయంగా జనపనార, గుడ్డ సంచులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చడమే ధ్యేయంగా ఈ ప్రచారం సాగుతోంది. "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం. ప్లాస్టిక్ వాడకం మానండి – నగరాన్ని కాపాడండి" అంటూ ఎమ్మెల్యే గిద్దలూరు పట్టణంలోని ప్రజలను కోరారు ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొడతామని పర్యావరణాన్ని కాపాడుకుంటామని సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ , మున్సిపల్ కమిషనర్ , సిబ్బంది, మహిళలు, కౌన్సిలర్ లు స్థానిక వార్డు నాయకులు పెద్ద సంఖ్యలో స్వచ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు

## బాధిత కుటుంబానికి 25000 ఆర్థిక సహాయం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల.



గిద్దలూరు, ఉషశ్రీ. గిద్దలూరు పట్టణంలోని ఎస్.టి.కాలనీ నందు నివాసం ఉంటున్న రాగిరి. రవణమ్మ మేకలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నారు అయితే ఇటీవలే దురదృష్టశత్తు కుక్కల దాడిలో మేకలు మరణించడం జరిగింది ఈ రోజు మున్సిపల్ కార్యాలయంలో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి విచారం వ్యక్తం చేసి తన సొంత నిధులతో 25,000 రూపాయలు ఆర్థిక సహాయం చేసి మరలా జీవాలు తీసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలని అలాగే కుటుంబానికి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ , పట్టణ అధ్యక్షుడు , కౌన్సిలర్ లు వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకుగురైన బాధితులకు మెరుగైన వైద్యం అందించడం జరుగుచున్నది...



భీమవరం: (ఉషశ్రీ)మే 16 పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం శీతలం కొండెపాడు గ్రామానికి చెందిన 12 మంది ఈ నెల 13వ తేదీన కలుషిత ఆహారం తీసుకోవడంతో తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బాధితులను వెంటనే భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రులు ఇంపీరియల్ హాస్పిటల్, భీమవరం హాస్పిటల్ కు తరలించి అత్యవసర వైద్యం అందించగా, ప్రస్తుతం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో మెరుగైన చికిత్స కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గత నాలుగు రోజులుగా బాధితులకు ప్రత్యేక వైద్య బృందాల ఆధ్వర్యంలో నిరంతర చికిత్స అందిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో ముఖమట్ల శ్రీనివాసు (48), ముఖమట్ల కనకదుర్గ (44), తోట సత్యనారాయణ (45), తోట సుబ్బలక్ష్మి (45), ఎం. లక్ష్మి కుమారి (26), మహాన్ (3), ఎస్. నరసింహమూర్తి (64), కె. దీపిక (27), ఈద సుజాత (50), కొండేటి ధనలక్ష్మి (43), పచ్చ వెంకటలక్ష్మి (43), నక్కా కాసులమ్మ (65) ఉన్నారు. ఆహార నమూనాలను ఫుడ్ సేఫ్టీ శాఖ ద్వారా పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం బాధితులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్సకు సానుకూలంగా స్పందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ రోజు మే 16న ముఖమట్ల శ్రీనివాసు, ముఖమట్ల కనకదుర్గ, నక్కా కాసులమ్మ, తోట సుబ్బలక్ష్మి, ఎం. లక్ష్మి కుమారి, ఈద సుజాతలను పూర్తిగా కోలుకోవడంతో ఆరుగురిని ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిగిలిన వారిని కూడా పూర్తి స్థాయిలో కోలుకున్న అనంతరం డిశ్చార్జ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఆహార విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఆహారం తీసుకోవద్దని సూచించారు.

## గంధం ఉమా ఇంట మెరిసిన అరుదైన "మే " పుష్పం




ఆకివీడు ఉషశ్రీ : సృష్టిలో జీవకోటితోపాటు ప్రకృతి అనేది భగవంతుడు ప్రసాదించిన ఒక వరం అటువంటి ప్రకృతిలో ఎన్నో వింతలు ఎన్నో విశేషాలు మనకి తారసపడతాయి మనం ప్రకృతికి ఏమిస్తామో ప్రకృతి కూడా మనకు అదే ఇస్తుంది అనేక రకాలైన జీవరాసులలో కొన్ని రకాలైన పక్షులు జీవులు మొక్కలు అరుదుగా మనకు తారసపడతాయి అటువంటి వాటిలలో ఒకటి మే పుష్పం ఇది కేవలం మే నెలలో మాత్రమే వికసించే ఒక అరుదైన వృక్షజాతికి చెందిన పుష్పము ఆకివీడు పట్టణానికి చెందిన గంధం ఉమా పెరట్లో ఈ పుష్పం వికసించటంతో ప్రజలు వచ్చి "మే "పుష్పాన్ని చూడడానికి ఆసక్తి చూపుతున్నారు. సంవత్సరంలో కేవలం మే నెలలో మాత్రమే ఇది వికసిస్తుంది ఒక చెట్టుకు ఒక పుష్పం మాత్రమే వస్తుంది ఇది మే నెల అంతా చెట్టుకు వన్నెతెస్తూ జూన్ నెలలో పుష్పం వాడిపోతూ ఉంటుంది మరల మే నెల వచ్చినప్పుడే ఈ చెట్టుకి పుష్పం అనేది వస్తుందని గంధం ఉమా తెలియజేశారు ఇటువంటి వృక్షం వారింట్లో పెరగటంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఇటువంటి వృక్షాలు ప్రతి ఒక్కరు పెంచి వృక్ష సంపదను అభివృద్ధి చేయాలని అరుదైన ఇటువంటి మొక్కలను పరిరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు

# ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు సమిష్టి కృషి అవసరం




- ప్రతి ఇంటి వారు బాధ్యతగా మెలగాలి
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం: (ఉషశ్రీ) మే 16: పర్యావరణ, ప్రజారోగ్య సంరక్షణ దృష్ట్యా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా విడనాడి జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు జిల్లా ప్రజలు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా "ప్లాస్టిక్ రహిత రాష్ట్రం" అనే ఇతివృత్తంతో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ బహిష్కరణ, పర్యావరణహిత వస్తువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం భీమవరం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆనంద ఇన్ సమావేశ హాలులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాను ప్లాస్టిక్ రహితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని అన్నారు.
పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేసి పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల ద్వారా కుటుంబాలకు, సమాజానికి చైతన్యం చేరుతుందని పేర్కొన్నారు. ప్రతి వార్డులో కేటాయించిన ప్రదేశాల్లోనే చెత్త వేయాలని, కాలువలు, రహదారుల పక్కన చెత్త పారవేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వ్యాపార సంస్థలు తమ దుకాణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దుకాణాల ఎదుట చెత్త ఉంటే యజమానులనే బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వ్యాపారులకు అవగాహన కల్పించి, నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్లాస్టిక్ విక్రయం మాత్రమే కాకుండా వినియోగంపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, చిన్న వ్యాపారులు బయోడిగ్రేడబుల్ వస్తువులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, వీధుల్లో వ్యర్థాలను బహిరంగంగా వేయకుండా పర్యవేక్షణ పెంచాలని అన్నారు. గుడ్డ సంచులు, కాగితం సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలు ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని, కళాశాలల నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్ వరకు అన్ని వర్గాలు ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వార్డుల వారీగా ప్రణాళికలు రూపొందించి ప్లాస్టిక్ నివారణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులతో సమన్వయం చేసుకొని ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ నిల్వలు, విక్రయాలపై దాడులు నిర్వహించి జరిమానాలు విధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎ.రాంబాబు, బీసీ వెల్ఫేర్ అధికారి ఏవి సూరిబాబు, పబ్లిక్ హెల్త్ అధికారి సోమశేఖర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చెరుకువాడ రంగస్వామి, స్వర్ణ వార్డు సిబ్బంది, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, మెప్మా సభ్యులు, శానిటేషన్ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలందరు డెంగ్యూ నివారణలో భాగస్వాములు కావాలి, "మన పరిసరాల పరిశుభ్రతే – మన ఆరోగ్య భద్రత"






జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.జి.గీతా బాయి

భీమవరం: (ఉషాశ్రీ)మే 16: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శనివారం భీమవరం పట్టణంలోని ప్రకాశం చౌక్ నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.జి.గీతా బాయి, తదితరులు పాల్గొని ప్రజలకు డెంగ్యూ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.జి.గీతా బాయి మాట్లాడుతూ, డెంగ్యూ వ్యాధి ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రజారోగ్యానికి ఒక ప్రధాన సవాలుగా మారిందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
డెంగ్యూ వ్యాధి సోకినప్పుడు అకస్మాత్తుగా అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాలు మరియు కీళ్ల నొప్పులు, కళ్ల వెనుక నొప్పి, శరీరంపై దద్దుర్లు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. తీవ్రమైన పరిస్థితుల్లో రక్తస్రావం మరియు ప్లేట్లెట్ల సంఖ్య తగ్గిపోవడం జరుగుతుందని, అలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. డెంగ్యూ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారణమైన ఏడిస్ ఈజిప్టి దోమలు నిల్వ నీటిలో పెరుగుతాయని తెలిపారు. ఇంటి చుట్టుపక్కల పాత టైర్లు, కొబ్బరి చెక్కలు, కుండీలు, నీటి ట్యాంకులు, పాడైన వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ట్యాంకులను మూతపెట్టి ఉంచడం, గట్టర్లను శుభ్రంగా ఉంచడం, వారానికి ఒకసారి డ్రై డే పాటించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా ఉదయం మరియు సాయంత్రం సమయాల్లో దోమల నివారణ క్రీములు ఉపయోగించడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం, ఇంటి కిటికీలు మరియు తలుపులకు మెష్‌లు ఏర్పాటు చేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. డెంగ్యూ జ్వర సమయంలో శరీరంలో నీటి శాతం తగ్గిపోకుండా ఎక్కువగా నీరు, కొబ్బరి నీరు, పండ్ల రసాలు తీసుకోవాలని తెలిపారు. విటమిన్–సి అధికంగా ఉండే పండ్లు, ఆకుకూరలు, ప్రోటీన్ కలిగిన ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా.వి.క్రాంతి కుమార్, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, జిల్లా ఉప మలేరియా అధికారి, డిప్యూటీ హెచ్.ఈ.ఓ, ఎస్.యు.ఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మరియు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జపాన్, దుబాయ్, ఇజ్రాయల్ లో ఉద్యోగ అవకాశాలు.

భీమవరం: (ఉషశ్రీ) మే 16 ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (APSSDC) ఆధ్వర్యంలో విదేశీ ఉద్యోగ కార్యక్రమాలను ప్రారంభించింది. దుబాయ్, ఇజ్రాయల్, జపాన్, జర్మనీ ఉద్యోగాల కొరకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. లోకమాన్ తెలిపారు. ఇజ్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాలు కొరకు APSSDC -- OMCAP -- NSDC ద్వారా ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. GDA / ANM / GNM / B.Sc Nursing / Post B.Sc Nursing పూర్తి చేసి, 25 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు మరియు పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు.సుమారు నెల జీతం రూ.1,99,770/- వరకు ఉండనుంది. కాంట్రాక్ట్ వ్యవధి 2 సంవత్సరాలు. ఇంటర్వ్యూ ఆన్‌లైన్ మరియు వీడియో రికార్డింగ్ విధానంలో నిర్వహించబడుతుంది. అలాగే దుబాయ్ (UAE)లో టాక్సీ డ్రైవర్ ఉద్యోగాల కోసం పురుష అభ్యర్థుల నుండి కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కనీసం SSC ఉత్తీర్ణత, భారతీయ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. వయస్సు 25 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలి. నెలకు 1,04,664 నుండి 1,30,195 వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. ఎంపిక ప్రక్రియ డ్రైవింగ్ టెస్ట్ ద్వారా జరుగుతుంది. ఇక శ్రీ సిటీలో నిర్వహించే "జపాన్ జాబ్ ఆపర్చునిటీ ప్రోగ్రామ్" ద్వారా యువతకు జపనీస్ భాషా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు, కనీసం 10వ తరగతి / ఇంటర్ / ITI / డిప్లొమా / డిగ్రీ / ANM / GNM అర్హత కలిగి ఉండాలి. శిక్షణ కాలం 6 నుండి 8 నెలలు. నెలకు సుమారు రూ.1,03,996/- నుండి రూ.1,45,000/- వరకు నెల జీతం పొందే అవకాశం ఉందని అని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం. ఏపీ.జి వో వి. ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. అలాగే జర్మనీ లో నర్స్ ఉద్యోగాల కొరకు మహిళా అభ్యర్థుల నుండి కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కనీసం డిగ్రీ ఉత్తీర్ణత, వయస్సు 30 సంవత్సరాల లోపు ఉండాలి. 2 సంవత్సరాలు నర్స్ ఉద్యోగములో అనుభవం ఉండాలి. నెలకు 2,90,000 నుండి 3,30,000 వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. జర్మనీ లాంగ్వేజ్ కోసం శిక్షణ కాలం 6 నుండి 8 నెలలు విజయవాడలో శిక్షణ నిర్వహించబడుతుంది. మరిన్ని వివరాలకు (స్కిల్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ జీడి శ్రీనివాస్: 8688594244 ను సంప్రదించవలసిందిగా తెలిపారు.



# ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువులను వినియోగించాలి, ప్రోత్సహించాలి





## జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం: (ఉషశ్రీ) మే 16** స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా, భీమవరం పట్టణంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పట్టణంలోని పలు క్యారీ బ్యాగుల విక్రయ దుకాణాలు, ప్లాస్టిక్ వస్తువుల నిల్వ కేంద్రాలు, హోటళ్లు మరియు రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి వ్యాపారి కచ్చితంగా పాటించాలని సూచించారు. సింగిల్ యుజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ కోటింగ్ కలిగిన ప్లేట్లు తదితర నిషేధిత వస్తువుల విక్రయం పూర్తిగా నిలిపివేయాలని హెచ్చరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వస్త్ర సంచులు, నార సంచులు, కాగితపు సంచులు వంటి ప్రత్యామ్నాయ వస్తువులను మాత్రమే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, హాస్టళ్లు మరియు ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో ఆకులతో తయారుచేసిన ఇస్తరాకులు, అరిటాకులు మరియు ఇతర సహజ పదార్థాలతో తయారైన ప్లేట్లు, ప్యాకింగ్ వస్తువులను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. ఆహార పదార్థాల నిల్వ మరియు సరఫరాలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పూర్తిగా నివారించాలని, పర్యావరణానికి హాని కలిగించని పదార్థాలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే దుకాణాలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణ యజమానులు తమ వద్ద ఉన్న ప్లాస్టిక్ నిల్వలను వెంటనే తొలగించి, భవిష్యత్తులో అలాంటి వస్తువులను కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా రెస్టారెంట్లు, టిఫిన్ హోటళ్లకు ప్లాస్టిక్ వస్తువులను సరఫరా చేయవద్దని వ్యాపారులకు సూచించారు. ప్లాస్టిక్ నియంత్రణ మరియు పర్యావరణ పరిరక్షణలో ప్రజలు, వ్యాపారులు సమిష్టిగా భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరిస్తేనే ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ తనిఖీలలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రత గాల్లో కలిసింది: మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు




**ఇంద్రకీలాద్రి,(ఉషశ్రీ )మే 16:** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో పాలకమండలి, ఈవో నిర్లక్ష్య వైఖరి కారణంగా భక్తుల భద్రత పూర్తిగా దెబ్బతిన్నదని దేవస్థానం మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం స్థానిక బ్రాహ్మణ వీధిలోని వైఎస్సార్సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గుంటూరుకు చెందిన చిన్నారి స్నేహ తన తల్లిదండ్రులతో కలిసి మెట్లపూజ మార్గంలో వెళ్తుండగా పై స్లాబ్ పెచ్చులు ఊడి తలపై పడి తీవ్రంగా గాయపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఈవో గానీ, పాలకమండలి సభ్యులు గానీ పరిశీలించలేదని ఆరోపించారు. ఆలయంలో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉన్నారని అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రమాద సమయంలో వారు లేకపోవడంతో కంపౌండర్, నర్సులతోనే చిన్నారికి చికిత్స చేయాల్సి వచ్చిందన్నారు. వీకెండ్స్‌లో వేలాది మంది భక్తులు వచ్చే పరిస్థితిలో కనీసం అంబులెన్స్, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉంచకపోవడం దురదృష్టకరమన్నారు. దేవస్థానంలో పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా విఫలమైందని రాంబాబు ఆరోపించారు. "పద్మావతి శానిటేషన్ ఏజెన్సీ"కు టెండర్లు కట్టబెట్టి భక్తుల సొమ్మును దోచుకుంటున్నారని విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో తక్కువ మంది సిబ్బందితోనే సమర్థంగా పారిశుద్ధ్య నిర్వహణ జరిగిందని, ప్రస్తుతం సిబ్బంది సంఖ్య పెంచినా పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. కనకదుర్గ నగర్ బాత్రూంలో మూడు రోజుల పాటు శవం కుళ్లిపోతున్నా గుర్తించలేని స్థితి నెలకొనడం దారుణమన్నారు. సంబంధిత ఏజెన్సీ టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల బాత్రూమ్‌లలో వీడియో క్లిప్పింగ్స్ తీసిన ఘటనపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆలయ చైర్మన్ కుమారుడు అధికారులపై, సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారని, జూనియర్ అసిస్టెంట్‌పై భౌతిక దాడి జరగడం రౌడీయిజానికి నిదర్శనమని మండిపడ్డారు. విధులు నిర్వర్తించిన టెంపుల్ సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్‌ను పక్కకు తప్పించడం కూడా అన్యాయమన్నారు. శానిటేషన్ కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వడం లేదని రాంబాబు ఆరోపించారు. గతంలో తాము రూ.11,800 వేతనం చెల్లించగా, ప్రస్తుతం బడ్జెట్ పెరిగినా కార్మికులకు ఇచ్చే వేతనం తగ్గించారని తెలిపారు. అలాగే దుర్గా ఘాట్‌లో మహిళలకు సరైన డ్రెస్ చేంజింగ్ రూమ్స్, వాష్‌రూమ్స్ లేకపోవడం, వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల ఘాట్ అధ్వానంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న శానిటేషన్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కర్నాటి రాంబాబు హెచ్చరించారు. అలాగే ద్వారకా తిరుమల, సింహాచలం, కాణిపాకం, శ్రీశైలం వంటి ఇతర ప్రధాన దేవాలయాల్లో జరుగుతున్న శానిటేషన్ అక్రమాలను కూడా ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు.

# గృహ గణన నమోదును ఈ నెల 28 నాటికి నూరు శాతం పూర్తి చేయాలి

## జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం: (ఉషశ్రీ)మే 16** జిల్లాలో జరుగుతున్న గృహ గణన నమోదును ఈ నెల 28వ తేదీ నాటికి నూరు శాతం పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలో గృహ గణన నమోదు ప్రగతిపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురపాలక సంఘాలు, మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గృహ గణన నమోదు కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. తహసిల్దార్లు, ఎంపీడీవోలు గ్రామాలు, వార్డుల్లో పర్యటిస్తూ రోజువారీ ప్రగతిని సమీక్షించి, ఎన్యూమరేటర్ల పనితీరును పరిశీలించాలని ఆదేశించారు. భీమవరం, ఆకివీడు పురపాలక సంఘాల పరిధిలో గృహ గణన నమోదు లక్ష్య సాధనలో వెనుకబడిన పరిస్థితిపై జాయింట్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఎన్యూమరేటర్ రోజుకు కనీసం 40 నుండి 50 ఇళ్ల గణన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో 10 శాతం కూడా పూర్తి చేయని ఎన్యూమరేటర్లతో జాయింట్ కలెక్టర్ వెబ్ ఎక్స్ ద్వారా నేరుగా మాట్లాడి, ప్రగతి లోపానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే రెండు రోజుల్లో పనితీరులో గణనీయమైన పురోగతి కనిపించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు సమిష్టిగా కృషి చేసి గృహ గణన నమోదును నిర్ణీత గడువులోగా నూరు శాతం పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఆకివీడు రైస్ మిల్ అసోసియేషన్ యాజమాన్యంతో కార్మికులు ఒప్పందం



**ఆకివీడు: (ఉషశ్రీ) మే 16:** ఐక్యతతో రైస్ మిల్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం చర్చల ద్వారా చేసుకోవడం జరిగిందని రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ జిల్లా కార్యదర్శి బి వాసుదేవరావు అన్నారు. ఈరోజు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వద్ద యజమాన్యులు, కార్మిక సంఘ నేతలు మధ్య జరిపిన చర్చల అనంతరం ఉన్న వేతనంపై 10 శాతం పెంపుదల జరిగిందని అన్నారు. ఈ ఒప్పందం రెండు సంవత్సరాలు అనగా 30/4/2028 వరకు అమలై ఉంటుందని బట్టలు నిమిత్తం గతం కంటే 500 రూపాయలు అదనంగా పెంచడం జరిగిందని అన్నారు. చర్చలకు సహకరించిన యాజమాన్లు పేరూరు రాధాకృష్ణ, మోటుపల్లి సుబ్బారావు, వానపల్లి రాంబాబు, గొంట్ల సత్యనారాయణ, మరియు కార్మికుల తరఫున పెంకి అప్పారావు, కే తవిటినాయుడు, బలరాం శ్రీనివాసరావు, తమ్మిశెట్టి కృష్ణ, గండేటి ఈశ్వరరావు, రత్తయ్య, తదితర మేస్త్రులు సమక్షంలో ఒప్పందం చేసుకోవడం జరిగింది. కార్మికులు ఐక్యతతో అగ్రిమెంటు ను అమలు జరుపుకోవాలని బి. వాసుదేవరావు అన్నారు.

# సిఎం సహాయ నిధి అందజేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం:(ఉషశ్రీ) మే 16** వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో శనివారం రూ.6,60,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సుమారు రూ.7 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి అందించామని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో భారీగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చినా జనసైనికులు వెంటనే స్పందించి సహకరిస్తారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన కార్యాలయంలో సిబ్బంది ప్రతిరోజూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఎవరికి సహాయం కావలసి వచ్చిన ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, కాళ్ల గోపికృష్ణ, మద్దాల మణికుమార్, దినేష్ యాదవ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# దళిత ఆత్మగౌరవ గుండెచప్పుడు పేరుతో ప్రచార రథాల ప్రారంభం



**విజయవాడ,(ఉషశ్రీ)మే 16:** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో "దళిత ఆత్మగౌరవ గుండెచప్పుడు" పేరుతో నిర్వహించనున్న డప్పు కళాకారుల ప్రదర్శనలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ప్రచార చైతన్య రథాలను ప్రారంభించారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం చైతన్య రథాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ, ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న డప్పు కళాకారుల ప్రదర్శనలకు రాష్ట్ర నలుమూలల నుంచి కళాకారులు విజయవాడకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు బసవరాజు, ఉదయ్, రాకేష్, వల్లూరి గంగాధర్, పిట్టల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకివీడులో ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన: నగర పంచాయతీ



**ఆకివీడు: (ఉషశ్రీ) మే 16** స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆకివీడు నగర పంచాయతీ అధికారులు ఆకివీడులో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై కఠిన చర్యలు చేపట్టి పలు క్యారీ బ్యాగులు ,విక్రయ దుకాణాలు,ప్లాస్టిక్ వస్తువులు, హోటల్లు మరియు రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. సానిటరీ ఇన్స్పెక్టర్ సాకేత్ బాబు ఆధ్వర్యంలో దుకాణదారులకు ప్లాస్టిక్ వాడవద్దు అంటూ హెచ్చరికలు జారీ చేశారు. సింగిల్ జ్యూస్ ప్లాస్టిక్ నిషేధం పై వ్యాపారస్తులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# విలేకరి బోగిశెట్టి ని పరామర్శించిన పాత్రికేయ మిత్రులు



**ఉష శ్రీ ప్రతినిధి కొత్తపేట.:** ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విలేకరి భోగిశెట్టి నాగేశ్వరరావును శనివారం సీనియర్ పాత్రికేయులు, ప్రముఖ రచయిత భోగాది వెంకటరాయుడు, విజయవాడ సెంట్రల్ అడిషనల్ ఎస్పీ ఎంబీఏ మురళీకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడారు. పాత్రికేయ రంగంలో నాగేశ్వరరావు అందిస్తున్న సేవలను అభినందించిన వారు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాత్రికేయ సహచరులు, స్నేహితులు మాట్లాడుతూ వార్తలు రాయడంలో ఆయనకున్న ప్రత్యేకతను గుర్తు చేస్తూ నాగేశ్వరరావు త్వరగా కోలుకుని మళ్లీ తన సేవలను కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నారు.

## సబ్ జైల్ ను తనిఖీ చేసిన జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఇన్చార్జి సెక్రటరీ మరియు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్



**గిద్దలూరు, ఉషశ్రీ :** గిద్దలూరు పట్టణంలోని సబ్ జైల్ ను జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఇన్చార్జి సెక్రటరీ మరియు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్. వి. రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైల్లో ఉన్న ప్రతి ఒక్కరి కేసుల వివరములను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ప్రవర్తించాలన్నారు. క్షణికావేశంలో నేరాలు చేయకూడదని, ఆవేశం అనర్ధాయకమని తెలియజేశారు. బెయిల్, సింగిల్ షూరిటీ మరియు అర్హులకు ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. బెయిల్ పొందిన వారు సదరు కేసు పూర్తయ్యే వరకు కోర్టు ముందు ప్రతి వాయిదాకు హాజరు కావాలన్నారు. తదుపరి ఖైదీలకు అందుతున్న సదుపాయములను ,ఆహార పదార్ధములను మరియు సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కె. భరత్ చంద్ర ,లీగల్ ఎయిడ్ న్యాయవాది బి .రాజ్ కుమార్ నాయక్, సబ్ జైల్ సూపరింటెంట్ యూ. లింగారెడ్డి, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు ,జైల్లో ఉన్న ఖైదీలు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## కామాక్షి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



**ఇంద్రకీలాద్రి, (ఉషశ్రీ )మే 16:** నెల్లూరులోని ప్రసిద్ధ శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయంకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం శనివారం సాంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు. దుర్గ గుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఆలయ ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి, ట్రస్ట్ బోర్డు సభ్యులు మరియు అర్చక బృందం కలిసి నెల్లూరు కామాక్షి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల నిర్వాహకులు నెల్లూరు అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు-కుంకుమలు, ప్రసాదాలను ఆలయ అధికారులకు అందజేశారు. స్థానిక శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రి ఆలయ ప్రతినిధులకు ఘన స్వాగతం లభించింది. నెల్లూరు దేవస్థాన మర్యాదలతో ఆమె దుర్గమ్మ ఆలయ చైర్మన్, ట్రస్ట్ బోర్డు సభ్యులు మరియు అర్చక బృందాన్ని సత్కరించారు. అనంతరం ఇంద్రకీలాద్రి అర్చక బృందం నెల్లూరు కామాక్షి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం చేశారు. రెండు ప్రసిద్ధ శక్తిపీఠాల ఆధ్యాత్మిక బంధాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

## పాత మెట్ల మార్గ ఘటనపై దేవస్థానం వివరణ

**ఇంద్రకీలాద్రి (ఉషశ్రీ )మే 16:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం పాత మెట్ల మార్గంలో బాలికకు గాయమైన ఘటనపై వస్తున్న కథనాలకు దేవస్థానం వివరణ ఇచ్చింది. ఈ మేరకు ఈ ఒసేన నాయక్ ఒక ప్రకటన లో వివరించారు.గుంటూరుకు చెందిన కుటుంబం అమ్మవారి దర్శనానికి వస్తుండగా, పాత నిర్మాణంలోని స్లాబ్ పెచ్చు ఊడి 9 ఏళ్ల బాలిక స్నేహ తలకు స్వల్ప గాయం అయిందని తెలిపారు. వెంటనే దేవస్థానం సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, అనంతరం ఆధునిక అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యంగా ఉందని, కుటుంబం సురక్షితంగా స్వగ్రామానికి వెళ్లినట్లు తెలిపారు . ఘటన అనంతరం భక్తుల భద్రత దృష్ట్యా పాత మెట్ల మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసి అత్యవసర మరమ్మతులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆలయ పరిధిలోని సివిల్, ఎలక్ట్రికల్ విభాగాలపై సమగ్ర టెక్నికల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ డాక్టర్ ఎం. హరిజవహర్ లాల్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వైద్య సేవల కోసం ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులను కేటాయించాలని గత ఏడాదే ప్రభుత్వానికి లేఖ రాసినట్లు, ప్రస్తుతం ఒక వైద్యుడు సేవలందిస్తున్నారని వివరించారు . అదనంగా ఒక జిఎన్ఎమ్ , ముగ్గురు ఎంపీహెచ్డబ్ల్యు సిబ్బందిని నియమించి వైద్య సేవలు బలోపేతం చేసినట్లు తెలిపారు. దాతల సహకారంతో సమకూరిన రెండు అధునాతన అంబులెన్స్‌లు భక్తుల అత్యవసర సేవలకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది. భక్తుల భద్రత, ఆరోగ్యం, సౌకర్యాలకే దేవస్థానం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని కార్యనిర్వహణాధికారి స్పష్టం చేశారు.

## దేశ వ్యాప్త మెడికల్ షాప్ ల బంద్ పోస్టర్ ఆవిష్కరణ.



**గిద్దలూరు ఉషశ్రీ.** మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలో శనివారం మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మే 20వ తేదీన దేశవ్యాప్తంగా ఒక్కరోజు పాటు అన్ని మెడికల్ దుకాణాలు బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ డిమాండ్ల సాధన మరియు సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అసోసియేషన్ హామీ ఇచ్చింది. ఈ బంద్‌కు సంఘీభావంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి మెడికల్ దుకాణదారుడు ఈ బంద్‌కు సహకరించాలని, అలాగే ప్రజలు కూడా సహకారం అందించాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.


# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించాలి

### ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం: (ఉషశ్రీ) మే 16** రాబోయే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను గణనీయంగా పెంచేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు, ఏపీసీలు, సెక్టోరల్ అధికారులతో "బడి పిలుస్తోంది" కార్యక్రమం అమలు తీరు పై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికల పెంపు కోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, నాణ్యమైన బోధన, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై తల్లిదండ్రులకు సమగ్ర అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందని, కోట్లాది రూపాయల వ్యయంతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు ఉచిత యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషకాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించలేక అనేక మంది తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి వివరించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపినప్పటికీ, సంబంధిత సర్టిఫికెట్లు ఇవ్వకుండా ప్రైవేట్ యాజమాన్యాలు అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులను చైతన్యపరచాలని అధికారులను కోరారు. "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, మండల విద్యాశాఖ అధికారులు, ఏపీసీలు, సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐగాట్ కోర్సుల్లో జిల్లా వెనుకబాటు



**భీమవరం: (ఉషశ్రీ)మే 16** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో ఉద్యోగులు పూర్తి చేసిన కోర్సుల ప్రగతిని ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులతో శాఖల వారీగా, మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఐగాట్ కర్మయోగి పోర్టల్ ద్వారా ఉద్యోగులు పూర్తి చేసిన కోర్సుల విషయంలో పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్ర స్థాయిలో దిగువ స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే విషయమన్నారు. గత ఐదు నెలలుగా సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు, ఉద్యోగులు నైపుణ్యాభివృద్ధి కోర్సుల పూర్తి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 010 పద్దు కింద జీతాలు పొందుతున్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తప్పనిసరిగా ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో నమోదు చేసుకుని, శాఖాపరమైన కోర్సులను పూర్తి చేయాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులు తమ వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి కనీసం 48 కోర్సులు పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. డీడీవోలు తమ పరిధిలోని ఉద్యోగులతో కోర్సులు పూర్తి చేయించేందుకు రోజువారీ సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే సోమవారం నాటికి ప్రతి శాఖ గణనీయమైన ప్రగతి సాధించాలని స్పష్టం చేశారు. జిల్లాలో అత్యధిక ఉద్యోగులు పనిచేస్తున్న విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్ శాఖలలో నమోదులు మరియు కోర్సుల పూర్తి శాతం తక్కువగా ఉందని పేర్కొంటూ, ఆయా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సిబ్బందిచే కోర్సులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రగతిలో వెనుకబడిన జిల్లాను రాష్ట్రంలో మొదటి వరుసలో నిలిపేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ నాగరాణి పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భీమవరం డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వెంకటలక్ష్మి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మైనర్లకు బైక్‌లు ఇస్తే కఠిన చర్యలు!.. ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కాళీ చరణ్..



**ఉండి (మే 16) ఉష శ్రీ :** పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ మరియు డీఎస్పీల ఆదేశాల మేరకు ఆకివీడు సర్కిల్ పరిధిలోని ఉండి మెయిన్ సెంటర్‌లో ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కాళీ చరణ్ ఆధ్వర్యంలో నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని వాహనాలపై పోలీసులు శనివారం రాత్రి ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) చేపట్టారు. ఆకివీడు సర్కిల్ సీఐ డి. కాళీచరణ్ , ఉండి ఎస్ఐ సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు నిర్వహించారు.?ఈ సందర్భంగా సీఐ కాళీచరణ్ మాట్లాడుతూ.. చాలా మంది వాహనదారులు నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్నారని, మరికొందరు నంబర్ ప్లేట్లు ఉన్నప్పటికీ వాటిపై అంకెలు సరిగ్గా కనిపించకుండా, నిబంధనలకు విరుద్ధంగా రకరకాల మోడల్స్‌తో వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నంబర్ ప్లేట్లు స్పష్టంగా లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు లేదా ఏదైనా నేరాలు జరిగినప్పుడు సదరు వాహనాలను గుర్తించడం పోలీసులకు కష్టతరంగా మారుతుందని ఆయన తెలిపారు. అందుకే నిబంధనలు ఉల్లంఘించిన సుమారు 15 వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులందరూ తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని స్పష్టం చేశారు.రోడ్లపై మైనర్ పిల్లలు విచ్చలవిడిగా వాహనాలు నడపడంపై సీఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు, పెద్దలకు ఆయన గట్టి హెచ్చరికలు జారీ చేశారు. మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేస్తూ ఏదైనా ప్రమాదానికి లేదా నేరానికి పాల్పడితే.. సదరు మైనర్లతో పాటు వారికి వాహనం ఇచ్చిన తల్లిదండ్రులను లేదా వాహన యజమానులను కూడా ఈ కేసులో ముద్దాయిలుగా చేర్చి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ కాళీచరణ్ హెచ్చరించారు.

## గిద్దలూరు రైల్వే స్టేషన్‌లో అకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసు సిబ్బంది.

**గిద్దలూరు, ఉషశ్రీ.** మార్కాపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం గిద్దలూరు రైల్వే స్టేషన్‌లో పోలీసులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. గిద్దలూరు అర్బన్ సీఐ కే. సురేష్ తన సిబ్బందితో కలిసి ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల రక్షణ మరియు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో, ప్లాట్‌ఫారమ్ లపై అనుమానా స్పదంగా తిరుగుతున్న వ్యక్తులను విచారించారు. ప్రయాణికులు తమ లగేజీ పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే వస్తువులను లేదా ఆహార పదార్థాలను తీసుకోకూడదని పోలీసులు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు మరియు నేరాల నియంత్రణకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అర్బన్ సీఐ కే. సురేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సీఐతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# గుజరాత్ టాప్-2 ఆశలపై నీళ్లు చల్లిన కేకేఆర్

- కేకేఆర్ 29 పరుగుల తేడాతో విజయం
- ఫిన్ అలెన్ 93 పరుగులతో విధ్వంసం
- అంగ్‌క్రిష్ రఘువంశీ 82 నాటౌట్ ఇన్నింగ్స్
- కేకేఆర్ భారీ స్కోరు 247/2 నమోదు
- గుజరాత్ 218/4కే పరిమితం
- గిల్, బట్లర్ హాఫ్ సెంచరీలు వృథా
- పాయింట్స్ టేబుల్‌లో కేకేఆర్ 7వ స్థానం



ఐపీఎల్ 2026 లీగ్ దశ ముగింపునకు ముందు కేకేఆర్ సంచలన విజయం సాధించింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక పోరులో కోల్‌కతా నైట్ రైడర్స్ 29 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్.. ఫిన్ అలెన్ (93), అంగ్‌క్రిష్ రఘువంశీ (82నా) విధ్వంసంతో 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 248 పరుగుల రికార్డు లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 218 పరుగులకే పరిమితమైంది. ఐపీఎల్ 2026లో లీగ్ దశ మ్యాచులు ముగింపు దశకు చేరుకుంటున్న వేళ.. టేబుల్‌లో అగ్రస్థానాల్లో ఉన్న జట్లకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్.. సీఎస్కేను ఓడించి ఆ జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలను దెబ్బతీసింది. తాజాగా కోల్‌కతా నైట్ రైడర్స్ కూడా.. గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి ఆ జట్టు టాప్-2 అవకాశాలపై ప్రభావం చూపించింది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్.. ఏకంగా 247/2 పరుగులు చేసింది. అనంతరం గుజరాత్ టైటాన్స్‌ను 218/4కి పరిమితం చేసింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్.. భారీ స్కోరు చేసింది. ఫిన్ అలెన్ 35 బంతుల్లో 93 రన్స్, అంగ్‌క్రిష్ రఘువంశీ 44 బంతుల్లో 82 రన్స్ సత్తాచాటడంతో 2 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. కామెరూన్ గ్రీన్ సైతం 28 బంతుల్లో 52 రన్స్ చేసి.. జట్టు భారీ స్కోరు చేయడంలో తన వంతు పాత్ర పోషించాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్.. ఆశించిన మేర వేగంగా బ్యాటింగ్ చేయలేకపోయింది. సాయి సుదర్శన్ రిటైర్డ్ హర్ట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన నిషాంత్ సింధు (1) విఫలమయ్యాడు. శుభ్‌మన్ గిల్ (49 బంతుల్లో 85 రన్స్), జోస్ బట్లర్ (35 బంతుల్లో 57 రన్స్) రాణించినా.. లక్ష్యానికి తగ్గట్లుగా వేగంగా పరుగులు రాబట్టలేకపోయారు. దీంతో సాధించాల్సిన రన్ రేట్ భారీగా పెరిగింది. చివరకు గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. 29 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈ మ్యాచ్ ఫలితంతో కేకేఆర్.. పాయింట్స్ టేబుల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను వెనక్కినెట్టి ఏడో ప్లేసుకు దూసుకొచ్చింది. ఆ జట్టుకు ఇది ఐదో విజయం. మిగిలిన రెండు మ్యాచులలో గెలిస్తే.. ఆ జట్టు ప్లే ఆఫ్స్ రేసులో ఉంటుంది. మరోవైపు ఈ మ్యాచులో గెలిచి ప్లే ఆఫ్స్ చేరిన తొలి జట్టుగా నిలవాలనుకున్న గుజరాత్ టైటాన్స్‌కు షాక్ తగిలింది. అయినా పాయింట్స్ టేబుల్‌లో మాత్రం ఆ జట్టు రెండో ప్లేసులో ఉంది. ఈ మ్యాచులో ఓడిపోయినా.. భారీ పరుగుల తేడాతో ఓడిపోకపోవడం ఆ జట్టు నెట్ రన్ రేట్‌ను కాపాడింది.

## 3 వికెట్లు పడినా తాను బ్యాటింగ్‌కి ఎందుకు రాలేదో చెప్పి, హృదయాలు గెలుచుకున్న రిషభ్ పంత్



లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్‌కి దిగలేదు. మూడు వికెట్లు పడిన తర్వాత కూడా పంత్ క్రీజులోకి రాలేదు. బ్యాటింగ్‌కి ఎందుకు రాలేదో ప్రజంటేషన్ సమయంలో రిషభ్ పంత్ వివరించాడు. ఈ మ్యాచ్‌లో ఇప్పటి వరకు ఎక్కువ అవకాశాలు రాని వారితో బ్యాటింగ్ చేయించాలని నిర్ణయించుకున్నానని, అందుకే తాను బ్యాటింగ్‌కి రాలేదని రిషభ్ పంత్ చెప్పి అభిమానుల హృదయాలు గెలుచుకున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ - చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌లో రిషభ్ పంత్ బ్యాటింగ్‌కి దిగలేదు. సాధారణంగా ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కి వచ్చే పంత్.. నికోలస్ పూరన్ కోసం ఆ స్థానాన్ని త్యాగం చేశాడు. ఆ తర్వాత సెకండ్ డౌన్, మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కి రావడం మొదలుపెట్టాడు. అయితే, సీఎస్కేతో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ అవకాశం వచ్చినా ఆడలేదు. తాను ఎందుకు బ్యాటింగ్‌కి రాలేదో చెప్పి అభిమానుల హృదయాలు గెలుచుకున్నాడు. సీఎస్కేపై విజయం చాలా మంచి ఫీలింగ్ ఇచ్చిందని రిషభ్ పంత్ అన్నాడు. హోం గ్రౌండ్‌లో ఇలాంటి విజయంతో సక్సెస్ ఫార్ములాకు దగ్గరయ్యామని చెప్పాడు. హోం కండిషన్స్‌లో నలుగురు ఫాస్ట్ బౌలర్లతో ఆడటం గెలుపునకు కీలక కారణమైందన్నాడు. ఈ సీజన్‌లో తాము ఇంకా మ్యాచ్‌లు ఆడాల్సి ఉందని, మంచి ఎండింగ్ అందిస్తామన్న నమ్మకం వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసుకుని ఆకట్టుకున్న ఆకాశ్ సింగ్ గురించి కూడా పంత్ మాట్లాడాడు. ఆకాశ్ సింగ్ సీజన్ మొత్తం చాలా కష్టపడ్డాడని, కొన్నిసార్లు ప్రతి ఆటగాడికి అవకాశం ఇవ్వడం కష్టంగా ఉంటుందని.. కానీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నాడు. ఆకాశ్ సింగ్ కోచ్‌లు చెప్పిన ప్లాన్‌ను ఫాలో అయ్యేవాడని, అదే ఈ రోజు సక్సెస్ మంత్రా అంటూ చెప్పుకొచ్చాడు. కోచ్‌లు ఏదైతే ప్లాన్ చెప్పారో అదే ప్లాన్‌తో బౌలింగ్ చేయడం చూసి చాలా సంతోషంగా అనిపించింది అన్నాడు."తాను బ్యాటింగ్ ఎందుకు చేయలేదో చెబుతూ "నేను ఎందుకు బ్యాటింగ్ చేయలేదంటే.. నేను బ్యాటింగ్‌కి రెడీగానే ఉన్నాను. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో ఒక ఆలోచన వచ్చింది. ఇప్పటి వరకు ఎక్కువ అవకాశాలు రాని ఆటగాళ్లకు అవకాశం ఇస్తే ఎలా ఉంటుందో అనిపించింది. మళ్లీ మళ్లీ ఆలోచించాను. అందుకే ముందు బ్యాటింగ్‌కి రాలేదు" అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు. ఇప్పటి వరకు 12 మ్యాచ్‌లు ఆడిన లక్నో 4 విజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగున పదో స్థానానికి పరిమితమైంది.

## మా లెక్క చాలా సింపుల్



ఐపీఎల్ 2026లో సీఎస్కే ప్రస్థానం ముగిసిందని అందరూ భావిస్తున్న వేళ ఆ జట్టు కెప్టెన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఫ్యాన్స్‌లో జోష్ నింపింది. ప్లే ఆఫ్స్‌లో తమ జట్టు అడుగుపెడుతుందని, ఎలాంటి పరిస్థితుల నుంచైనా కమ్ బ్యాక్ ఇస్తామంటూ రుతురాజ్ గైక్వాడ్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్ అనంతరం రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ ఒత్తిడికి గురవాల్సిన అవసరం లేదని, మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలిస్తే చాలు అంటూ సింపుల్‌గా చెప్పాడు. మ్యాచ్ అనంతరం ప్రజంటేషన్ సమయంలో రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ అంతా బాగనే ఆడామని, కాకపోతే ఒక బ్యాడ్ డే అనుకోవాలని జట్టును సమర్థించాడు. కార్తీక్ శర్మ 70కి పైగా పరుగులు చేయడం ఆనందంగా అనిపించిందని, మిడిలార్డర్ ఇంకాస్త బలపడాల్సిన అవసరం ఉందన్నాడు. చివరి రెండు మ్యాచ్‌లకు వెళ్లే ముందు తమ బ్యాటర్లు ఫామ్‌లోకి వస్తారనే నమ్మకం వ్యక్తం చేశాడు. బౌలింగ్ కూడా బాగానే ఉందని, కాకపోతే ఇవాళ ఒక బ్యాడ్ డే మాత్రమే అన్నాడు. లక్నో పిచ్‌పై 160 - 170 పరుగులు మాత్రమే చేస్తామని అనుకున్నామని, కానీ 180 పరుగులు దాటడం సంతోషంగా ఉందని రుతురాజ్ అన్నాడు. కానీ, ప్రత్యర్థి జట్టు తమ కంటే చాలా బాగా ఆడారని.. పిచ్ సహకరించకపోయినా ఆ రేంజ్ స్కోర్‌ని చేయడంతో క్రెడిట్ మొత్తం లక్నో బ్యాటర్లకు ఇచ్చాడు. షార్ట్ బాల్స్‌ను ఎదుర్కోవడంలో సీఎస్కే విఫలమైందని, మిచెల్ మార్ష్ షార్ట్ బాల్స్ బాగా ఆడటంతో మ్యాచ్ లక్నో గెలిచిందని చెప్పుకొచ్చాడు. ఇక ప్లే ఆఫ్స్ గురించి మాట్లాడుతూ "మామొదటి ఛాలెంజ్ చెన్నై చేరుకోవడమే. ఆ తర్వాత మేం ఎక్కడ మెరుగుపడాలో చూస్తాం. పరిస్థితులకు తగ్గట్టు మారాలి. మాకు లెక్క చాలా సింపుల్.. మిగిలి ప్రతి మ్యాచ్ గెలవాలి అంతే. ఎలాంటి కన్ఫ్యూజన్ లేదు. టెన్షన్ పడాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఆ రోజు ఎవరు బాగా ఆడతారో వారు మ్యాచ్‌ను మార్చుతారు. పరిస్థితులను మేమే తిరగరాస్తామని ఆశిస్తున్నాను" అని రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు.

# ఐపీఎల్ చరిత్రలో అరుదైన రికార్డు



కోల్‌కతా నైట్ రైడర్స్ వెటరన్ స్పిన్నర్ సునీల్ నరైన్ ఐపీఎల్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్ ద్వారా అతడు ఐపీఎల్‌లో 200 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తొలి విదేశీ ప్లేయర్‌గా సరికొత్త మైలురాయిని అందుకున్నాడు. 2012లో కేకేఆర్ తరఫున అరంగేట్రం చేసిన ఈ కరేబియన్ స్టార్.. గత 14 ఏళ్లుగా ఒకే ఫ్రాంచైజీకి ఆడుతున్నాడు. ఇదే సీజన్‌లో ఐపీఎల్‌లో 200 వికెట్లు తీసిన తొలి విదేశీ బౌలర్‌గా కూడా రికార్డు క్రియేట్ చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ వెటరన్ స్పిన్నర్ సునీల్ నరైన్ ఐపీఎల్ చరిత్రలో అరుదైన ఘనత సాధించాడు. 2012లో తొలిసారి ఐపీఎల్‌లో అడుగుపెట్టిన ఈ కరేబియన్ స్పిన్నర్.. ఈ లీగ్‌లో 200 మ్యాచులు ఆడిన తొలి విదేశీ ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ 2026లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ ద్వారా అతడు ఈ ఫీట్ సాధించాడు. మొత్తంగా ఈ ఫీట్ సాధించిన 13వ ఆటగాడిగా నిలిచాడు. 2012లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున తొలిసారి ఐపీఎల్ డెబ్యూ చేశాడు నరైన్. అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క సీజన్ కూడా మిస్ కాలేదు. ప్రతీ సీజన్‌లో బరిలోకి దిగాడు. 14 ఏళ్లుగా ఒకే ఫ్రాంఛైజీ తరఫున ఆడుతూ వచ్చాడు. లీగ్‌లో అత్యంత ప్రభావవంతమైన, ఆల్ రౌండర్‌గా నిలిచాడు. నరైన్.. 200 మ్యాచ్‌లలో 6.79 అద్భుతమైన ఎకానమీ రేటుతో 203 వికెట్లు పడగొట్టి, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత పొదుపైన బౌలర్లలో ఒకడిగా నిలిచాడు. బ్యాటర్ల ఆధిపత్యం పెరుగుతున్న ప్రస్తుత టీ20 క్రికెట్‌లోనూ అతడు.. బంతిపై నియంత్రణ కొనసాగించాడు. ఈ సీజన్‌లోనూ అతడు.. 6.64 ఎకానమీతో పరుగులు మాత్రమే ఇస్తూ 11 వికెట్లు తీశాడు. భారీ స్కోర్లు నమోదు అవుతున్న ఈ సీజన్‌లోనూ పొదుపుగా బౌలింగ్ చేస్తూ బ్యాటర్లకు కళ్లెం వేస్తున్నాడు. నరైన్ తన ఐపీఎల్ కెరీర్ మొత్తంలో, అతను 165.30 స్ట్రైక్ రేట్, 17.33 సగటుతో 1820 పరుగులు సాధించాడు. గతంలో ఓపెనర్‌గా వచ్చి మెరుపులు మెరిపించేవాడు. కానీ ఈ సీజన్‌లో మాత్రం కాస్త లేటుగా బ్యాటింగ్‌కు వస్తున్నాడు. బౌలింగ్‌లో మాత్రం సత్తాచాటుతున్నాడు. ఇక ఇదే సీజన్ ద్వారా నరైన్.. ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు తీసిన.. తొలి విదేశీ ప్లేయర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు.. 2012, 2014, 2024లో ఆ జట్టు విజేతగా నిలిచింది. ఈ మూడు సార్లు కూడా.. సునీన్ నరైన్.. కేకేఆర్ జట్టులో ఉన్నాడు. తన మిస్టరీ స్పిన్‌తో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతూ.. కేకేఆర్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మూడో ప్లేసులో కొనసాగుతున్నాడు.

# చరిత్ర సృష్టించిన ఐపీఎల్ 2026.. 19 ఏళ్లలో కనీవినీ ఎరుగని రికార్డు..!

ఐపీఎల్ 2026 సీజన్ సరికొత్త చరిత్రకు వేదికైంది. ఐపీఎల్ ప్రారంభమైన గత 18 సీజన్లలో ఎన్నడూ లేని విధంగా, ఈ ఏడాది టోర్నీలోని మొత్తం 10 ఫ్రాంచైజీల నుంచి కనీసం ఒక్కో ఆటగాడు సెంచరీ మార్కును అందుకున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ విరాట్ కోహ్లీ (105) చేసిన శతకంతో ఈ అరుదైన మైలురాయి పూర్తయింది. ఈ సీజన్‌లో చెన్నై తరఫున సంజూ శాంసన్ తొలి సెంచరీ చేయగా.. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (152నా) అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేశాడు. ఐపీఎల్ 2026లో అరుదైన రికార్డు నమోదైంది. ఈ సీజన్‌లో పది జట్లకు చెందిన ఆటగాళ్లు సెంచరీ చేశారు. ఇలా ఐపీఎల్‌లో పాల్గొన్న ప్రతీ జట్టులో నుంచి కనీసం ఒక్కరైనా సెంచరీ చేయడం ఇదే తొలిసారి. గత 18 సీజన్‌లలో ఒక్కసారి కూడా ఈ రికార్డు నమోదు కాలేదు. కానీ ఈ సారి మాత్రం అరుదైన రికార్డు నమోదైంది. కేకేఆర్‌తో మ్యాచ్‌లో ఆర్సీబీ స్టార్ విరాట్ కోహ్లీ సెంచరీ చేయడం ద్వారా ఈ ఫీట్ నమోదైంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో తొలి సెంచరీని సంజూ శాంసన్ సాధించాడు. చెపాక్‌లో డీసీతో జరిగిన మ్యాచ్‌లో అతడు 115 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అంతేకాకుండా ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లోనూ సంజూ శతక్కొట్టాడు. దీంతో ఈ సీజన్‌లో సీఎస్కే తరఫున రెండో సెంచరీ నమోదు చేశాడు.

**ముంబై ఇండియన్స్:** క్వింటన్ డి కాక్, తిలక్ వర్మ, ర్యాన్ రికెల్టన్: పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానాల్లో ఉన్నప్పటికీ ముంబై ఇండియన్స్ బ్యాటర్లు మాత్రం అత్యధికంగా మూడు సెంచరీలు కొట్టారు. పీబీకేఎస్‌తో మ్యాచ్‌లో డికాక్ (60 బంతుల్లో 112 పరుగులు నాటౌట్), గుజరాత్‌తో మ్యాచ్‌లో తిలక్ వర్మ (45 బంతుల్లో 101 రన్స్), సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో ర్యాన్ రికెల్టన్ (55 బంతుల్లో 123 పరుగులు) సెంచరీలు చేశారు.

**ఆర్సీబీ: విరాట్ కోహ్లీ:** డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ తరఫున విరాట్ కోహ్లీ సెంచరీ చేశాడు. కేకేఆర్‌తో మ్యాచ్‌లో 60 బంతుల్లో 105 పరుగులు చేశాడు.

**కోల్‌కతా నైట్ రైడర్స్: ఫిన్ అలెన్:** డీసీతో జరిగిన మ్యాచ్‌లో ఫిన్ అలెన్ 47 బంతుల్లోనే 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు.

**లక్నో సూపర్ జెయింట్స్: మిచెల్ మార్ష్:** ఆర్సీబీతో మ్యాచ్‌లో మిచెల్ మార్ష్.. 49 బంతుల్లోనే సెంచరీ సాధించి, ఐపీఎల్ చరిత్రలోనే ఎల్ఎస్‌జీ తరఫున ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టాడు. ఈ మ్యాచ్‌లో మార్ష్ 56 బంతుల్లో 111 పరుగులు చేశాడు.

**పంజాబ్ కింగ్స్: కూపర్ కన్నోలీ:** సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై కూపర్ కన్నోలీ 59 బంతుల్లో 107 పరుగుల చేశాడు. ఐపీఎల్ చరిత్రలో సెంచరీ చేసిన అత్యంత పిన్న వయస్కుడైన విదేశీ ఆటగాడిగా అతడు నిలిచాడు.

**రాజస్థాన్ రాయల్స్:** వైభవ్ సూర్యవంశీ: 15 ఏళ్ల యంగ్ డైనమైట్ వైభవ్ సూర్యవంశీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 37 బంతుల్లో 103 పరుగులు చేశాడు. ఇందులో 12 సిక్సర్లు ఉన్నాయి.

**ఢిల్లీ క్యాపిటల్స్:** కేఎల్ రాహుల్: పంజాబ్ కింగ్స్‌పై 66 బంతుల్లో అజేయంగా 152 పరుగులు చేసి, రాహుల్ ఈ సీజన్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరును నమోదు చేశాడు. ఇది రాహుల్‌కు ఆరో ఐపీఎల్ సెంచరీ.

**గుజరాత్ టైటాన్స్:** సాయి సుదర్శన్: గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్.. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీపై 57 బంతుల్లో శతకం సాధించాడు.

**సన్‌రైజర్స్ హైదరాబాద్: అభిషేక్ శర్మ :** లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అభిషేక్ శర్మ.. ఢిల్లీ క్యాపిటల్స్‌పై 68 బంతుల్లో 135 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇది అతడికి ఐపీఎల్‌లో రెండో శతకం.

# రోజ్ సర్దన అందమైన తెర



రోజ్ సర్దన తన అందమైన తెరప్రసన్నతతో, సహజమైన సౌమ్యతతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్నారు. ఆత్మవిశ్వాసంతో కూడిన భావప్రకటనలు, స్టైలిష్ ప్రజా ప్రదర్శనలు ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. వినోద రంగంలో ఆమె స్థిరంగా తన స్థానాన్ని నిర్మించుకుంటున్నారు. సాధారణ ఫోటోషూట్ అయినా, రెడ్ కార్పెట్ వేడుక అయినా, రోస్ తన ప్రత్యేకమైన ఫ్యాషన్ శైలితో మెరిసిపోతుంది. ఆధునిక శైలిని సహజమైన అందంతో మేళవిస్తూ ఆమె చూపించే తీరు ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇటీవల విడుదలైన ఆమె చిత్రాలు ఆమె వ్యక్తిత్వంలోని గ్లామర్ మరియు సరళతను సమంగా ప్రతిబింబిస్తున్నాయి. రోస్ సర్దానా ఫ్యాషన్ ఎంపికలు సాధారణంగా సాదాసీదాగా ఉన్నప్పటికీ ఆకర్షణీయంగా ఉంటాయి. ఇదే ఆమెను కొత్తగా ఎదుగుతున్న ప్రతిభావంతులలో ప్రత్యేకంగా నిలబెడుతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఆమె యువతతో సన్నిహితంగా మమేకమవుతూ, తన వృత్తి ప్రయాణం మరియు వ్యక్తిగత జీవితంలోని ముఖ్య క్షణాలను పంచుకుంటోంది. వృత్తిపరంగా, రోస్ సర్దానా ఇప్పటికే కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల్లో భాగమయ్యారు. సినిమాలు మరియు డిజిటల్ వేదికలలో కొత్త అవకాశాలను అన్వేషిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆమె తాజా ప్రదర్శనలు మరియు రాబోయే ప్రాజెక్టులు అభిమానుల్లో, సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. నటనకు మించి, రోస్ తన సానుకూల దృక్పథం మరియు సమతుల్య వ్యక్తిత్వంతో కూడా ప్రశంసలు పొందుతోంది. ఇవి ఆమె తెరపై పోషించే పాత్రలకు మరింత లోతును అందిస్తున్నాయి. ప్రతి ప్రాజెక్టుతో ఆమె సమకాలీన భారతీయ వినోద రంగంలో గుర్తింపు పొందిన ముఖంగా ఎదగడానికి మరింత దగ్గరవుతోంది. ఆమె ప్రయాణం కష్టపడి పనిచేసే తత్వాన్ని, అభివృద్ధి చెందుతున్న ప్రతిభను, మరియు రంగంలో చిరస్థాయిగా నిలవాలనే బలమైన ఆకాంక్షను ప్రతిబింబిస్తోంది.

# బుచ్చిబాబు చెప్పిన మాటకు షాకైన ఫైట్ మాస్టర్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా డైరెక్టర్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన పెద్ది సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. బుచ్చిబాబు ఈ సినిమాను కేవలం ఒక కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా, భావోద్వేగాలు, మాస్ ఎలివేషన్స్, రియలిస్టిక్ టచ్ కలిసిన ప్రత్యేకమైన అనుభూతిగా తీర్చిదిద్దారని ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర విషయం బయటకు వచ్చింది. ప్రముఖ ఫైట్ కొరియోగ్రాఫర్ నభ కాంత్ తన తాజా ఇంటర్వ్యూలో డైరెక్టర్ బుచ్చిబాబు గురించి చెప్పిన మాటలు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు దారి తీశాయి. ముఖ్యంగా పెద్ది ఇంట్రో సీన్ వెనుక ఉన్న ఆలోచన, ఆ సీన్ డిజైన్ చేసిన విధానం గురించి ఆయన చెప్పిన విషయాలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. నభకాంత్ వెల్లడించిన వివరాల ప్రకారం, బుచ్చిబాబు పెద్ది హీరో ఇంట్రో సీన్ గురించి తనకు పుష్ప2 టైమ్ లోనే చెప్పినట్టు చెప్పారు. అయితే అది సాధారణ యాక్షన్ సీన్ కాదని, కానీ ప్రేక్షకులకు యాక్షన్ ఫీల్ వచ్చేలా ఉండాలని బుచ్చి తనను కోరినట్లు తెలిపారు. “అది యాక్షన్ సీన్ కాదు... కానీ యాక్షన్ ఫీల్ ఇవ్వాలి” అని బుచ్చిబాబు చెప్పిన మాట తనకు మొదట షాక్ ఇచ్చిందని నభకాంత్ పేర్కొన్నారు. తర్వాత ఆ ఆలోచన ఆధారంగానే గ్లింప్స్‌లో కనిపించిన ప్రత్యేకమైన బ్యాటింగ్ స్టైల్ షాట్‌ను డిజైన్ చేశానని చెప్పారు. ఆ షాట్ విడుదలైన తర్వాత దేశవ్యాప్తంగా వైరల్ అయిందని, సోషల్ మీడియాలో లక్షలాది వ్యూస్ సంపాదించిందని ఆయన గుర్తు చేసుకున్నారు. అయితే ఆ సక్సెస్ లో బుచ్చిబాబు ఆ షాట్ మొత్తం క్రెడిట్‌ను తనకే ఇచ్చారని నభకాంత్ భావోద్వేగంగా చెప్పారు. ఆయనకు నిజంగా చాలా మంచి మనసు ఉందంటూ నభ కాంత్, డైరెక్టర్ వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతూ, బుచ్చిబాబు టీమ్‌ను ఎలా ప్రోత్సహిస్తారో మరోసారి చాటుతున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇండస్ట్రీలో డైరెక్టర్లు సాధారణంగా సినిమా విజయానికి ప్రధాన కారణంగా కనిపిస్తుంటారు. కానీ బుచ్చిబాబు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆయనతో పని చేసిన పలువురు టెక్నీషియన్స్ చెబుతున్నారు. ఫైట్ మాస్టర్స్ నుంచి సినిమాటోగ్రాఫర్స్ వరకు, అసిస్టెంట్ డైరెక్టర్స్ నుంచి ఆర్ట్ డిపార్ట్‌మెంట్ వరకు ప్రతి ఒక్కరి కష్టాన్ని ఆయన పబ్లిక్‌గా గుర్తిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా తన ఇంటర్వ్యూల్లో సినిమా బాగా రావడానికి టీమ్ ఎఫర్ట్స్ కారణమని చెప్పడం, ఒక్కరికే క్రెడిట్ తీసుకోకుండా అందరినీ మెచ్చుకోవడం ఇండస్ట్రీలో ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ఈ కారణంగానే పెద్ది సినిమా చుట్టూ ఒక పాజిటివ్ ఎనర్జీ ఏర్పడిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే గ్లింప్స్‌తో భారీ హైప్ తెచ్చుకున్న ఈ సినిమా, చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని అందరూ అభిప్రాయపడుతున్నారు.

# జయం రవి ఆవేదన!



తమిళ చిత్ర పరిశ్రమలో అగ్ర నటుడు జయం రవి (రవి మోహన్)... ఆయన మాజీ భార్య ఆర్తీల మధ్య నడుస్తున్న వివాదం రోజురోజుకూ ముదురుతోంది. గాయని కెనీషాతో బ్రేకప్ జరిగినట్లు వార్తలు వచ్చిన కొద్ది గంటల్లోనే జయం రవి మీడియా ముందుకు వచ్చి చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్‌లో పెను సంచలనం సృష్టించాయి. ఈ వివాదానికి సంబంధించిన తాజా పరిణామాలు, సోషల్ మీడియా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వైరల్ అవుతున్న పోస్టుల ప్రకారం.. జయం రవి తన మాజీ భార్య ఆర్తీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన వ్యక్తిగత జీవితం ఈ స్థాయికి చేరడానికి... తనపై నిరంతరం ఆన్‌లైన్ ట్రోలింగ్ జరగడానికి ఆమె చుట్టూ ఉన్న పరిసరాలే కారణమంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. గత కొంతకాలంగా జయం రవి, కెనీషాల బంధంపై సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున నెగటివిటీ నడిచింది. భార్య ఆర్తీతో రవి విడాకులు తీసుకోవడానికి కెనీషానే కారణమంటూ వచ్చిన ట్రోలింగ్ భరించలేక ఆమె ఈ బంధం నుండి తప్పుకుంటున్నట్లు పరోక్షంగా ప్రకటించింది. కష్టకాలంలో తనకు తోడుగా నిలిచిన కెనీషా ఆన్‌లైన్ బుల్లీయింగ్ కారణంగా దూరం జరగడంతో జయం రవిలోని ఆవేదన ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. తన మౌనాన్ని ఆసరాగా చేసుకుని తనపై నిరంతరాయంగా అసత్య ప్రచారాలు చేశారని, తన పరువుకు భంగం కలిగించేలా వ్యవహరించారని మాజీ భార్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంలో జయం రవి తన పిల్లల ప్రస్తావన తెస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తండ్రిగా తన పిల్లలను కలుసుకునే కనీస హక్కును కూడా తనకు దక్కకుండా చేస్తున్నారని ఆయన కన్నీరు పెట్టుకున్నారు. పిల్లల చుట్టూ బాడీగార్డ్స్‌ను ఉంచి... వారిని స్కూలు వద్ద కూడా కలవనీయకుండా చేస్తున్నారంటూ ఆర్తీపై తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేకాకుండా.. తాను కెరీర్‌లో సంపాదించిన సంపాదన అంతా కోల్పోయానని... ఒక అగ్ర నటుడిగా ఉండి కూడా ప్రస్తుతం తనకు కనీస ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా చేశారంటూ తన మాజీ భార్య ఫ్యామిలీ నెట్‌వర్క్‌పై ఆయన మండిపడ్డారు. మరోవైపు ఈ వివాదంలో ఒక అజ్ఞాత నటి ప్రస్తావన కూడా తెరపైకి వచ్చింది. ఆర్తీకి అత్యంత ఆప్తురాలిగా ఉంటూ.. ఈ వైవాహిక బంధాన్ని విచ్ఛిన్నం చేయడంలో కీలక పాత్ర పోషించిన ఒక మూడు అక్షరాల నటిని జయం రవి -ఇడ్లీ నటి- అని సంబోధిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. సమాజం ముందు నకిలీ ఫెమినిజం మాట్లాడే ఇటువంటి వారే తన సంసారాన్ని ముంచారంటూ రవి చేసిన కామెంట్స్ కోలీవుడ్‌లో కొత్త సమీకరణాలకు దారితీశాయి. ఆర్తీ తరపున నిలబడి తనపై తప్పుడు నరేటివ్స్ క్రియేట్ చేస్తున్న వారిని ఇకపై వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న ఈ విడాకుల వ్యవహారం.. ఇలా పబ్లిక్ ప్రెస్ మీట్లు, సోషల్ మీడియా క్రిప్టిక్ వార్నింగ్‌ల ద్వారా మరింత సంక్లిష్టంగా మారుతోంది. జయం రవి ఆరోపణలపై ఆర్తీ సైతం -మదర్ లయన్- అంటూ పరోక్షంగా స్పందిస్తూ తన పిల్లల రక్షణే తనకు ముఖ్యమని తేల్చి చెప్పారు. ఒకరినొకరు నిందించుకుంటూ.. వ్యక్తిగత విషయాలను బహిరంగంగా చర్చించుకుంటున్న తీరు సెలబ్రిటీల వ్యక్తిగత గౌరవానికే కాకుండా.. వారి సినిమాల బిజినెస్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపేలా ఉంది. ఈ సుదీర్ఘ వివాదం చట్టపరంగా ఎలాంటి ముగింపునకు చేరుకుంటుందో వేచి చూడాలి.

# ఆ కోలీవుడ్ హీరోకి నమస్కారం పెట్టాలంటున్న తనికెళ్ల భరణి

తమిళ స్టార్ హీరో ధనుష్ గురించి టాలీవుడ్ ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కమర్షియల్ హీరోగా భారీ స్థాయిలో మార్కెట్ ఉన్నప్పటికీ, ధనుష్ చిన్న సినిమాలకు, కొత్త టాలెంట్‌కు ఇస్తున్న ప్రోత్సాహాన్ని ప్రశంసిస్తూ భరణి చేసిన కామెంట్స్ సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ధనుష్‌కు చేతులెత్తి నమస్కారం చేయాలంటూ ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల్లో కూడా కొత్త చర్చకు దారి తీశాయి. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ధనుష్ ఒక కమర్షియల్ హీరో అయి ఉండి కూడా గత ఐదేళ్లుగా రెండు కోట్ల బడ్జెట్‌తో కొత్తవాళ్లతో సినిమాలు తీస్తున్నాడని, ప్రతి సినిమా పది కోట్ల వరకు రాబడుతోందని, నేషనల్ అవార్డులు కూడా వస్తున్నాయని, ఇది ఎంతో అందమైన కాన్సెప్ట్ అని, తెలుగు ఇండస్ట్రీలో ఎందుకు ఇలాంటి ప్రయత్నాలు ఎక్కువగా కనిపించట్లేదో తనకి అర్థం కావడం లేదని భరణి వ్యాఖ్యానించారు. ధనుష్ కెరీర్‌ను పరిశీలిస్తే భరణి చెప్పిన మాటల్లో నిజం కనిపిస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. హీరోగా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ధనుష్, మరోవైపు డైరెక్టర్ గా, నిర్మాతగా కూడా తనదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా కొత్త కథలు, కొత్త దర్శకులు, కొత్త నటులను ప్రోత్సహించే దిశగా ఆయన తీసుకుంటున్న అడుగులు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. చిన్న బడ్జెట్ సినిమాలు కేవలం ప్రయోగాలకే పరిమితం కాకుండా, కంటెంట్ బలంగా ఉంటే మంచి విజయాలు సాధించగలవని ఆయన వరుసగా నిరూపిస్తున్నారు. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద లాభాలు అందుకోవడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు, జాతీయ స్థాయి అవార్డులు కూడా సాధించడం విశేషం. అందుకే ధనుష్ మోడల్ ఇప్పుడు దక్షిణాది సినీ పరిశ్రమల్లో చర్చకు వస్తోంది. భారీ బడ్జెట్‌లతో స్టార్ సినిమాలు చేయడం ఒక వైపు అయితే, మరోవైపు చిన్న సినిమాలకు కూడా బలమైన వేదిక కల్పించడం ద్వారా పరిశ్రమకు కొత్త ఊపు తీసుకురావచ్చని చాలా మంది భావిస్తున్నారు. ఇక తనికెళ్ల భరణి చేసిన ఈ వ్యాఖ్యలు టాలీవుడ్‌పై కూడా ఓ పరోక్ష ప్రశ్నగా మారాయి. తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద హీరోలు, ప్రముఖ నిర్మాణ సంస్థలు ఉన్నప్పటికీ, కొత్తవాళ్లతో తక్కువ బడ్జెట్‌లో ప్రయోగాత్మక సినిమాలు నిర్మించే ప్రయత్నాలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయనే చర్చ మొదలైంది. ఇటీవల కొన్ని చిన్న సినిమాలు కంటెంట్ బలంతో భారీ విజయాలు సాధించినప్పటికీ, స్టార్ హీరోలు స్వయంగా ముందుకు వచ్చి అలాంటి ప్రాజెక్ట్‌లను నిర్మించడం మాత్రం తక్కువగానే ఉంది. అందుకే ధనుష్ చేస్తున్న ప్రయత్నాలను చూసి భరణి ప్రశంసించడం వెనుక పెద్ద సందేశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి ధనుష్‌పై తనికెళ్ల భరణి చేసిన ప్రశంసలు ఇప్పుడు సోషల్ మీడియాలో మాత్రమే కాదు, సినీ పరిశ్రమలో కూడా ఆలోచనలకు దారి తీస్తున్నాయి.



PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN